ప్రజా దీవెన
www.prajadeevena.com
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...
నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 362 | మంగళవారం | 3 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

‘గోపాల’ అంటే ఏమిటో మీకు తెలుసా? ‘గో’ అంటే జ్ఞానం లేదా వివేకం అని అర్థం. కాబట్టి, ‘గోపాల’ అంటే జ్ఞానాన్ని పెంపొందించుకునేవాడు అని అర్థం. మీలో ఉన్న జ్ఞానాన్ని మీరు పెంపొందించుకుంటున్నట్లయితే, మీరే గోపాలురు. చాలా సందర్భాల్లో, ఏదో ఒకటి మీకు మంచిదని తెలిసినప్పటికీ, మీరు దానిని ఆచరించరు. మీకు మంచిదని తెలిసినా కూడా దానిని పాటించకపోవడం అనేది ‘గోపాల’ స్థితి కాదు. ఏది మీకు మంచిదో అది తెలిసి, దానిని మీరు ఆచరించినప్పుడు, అదే ‘గోపాల’ స్థితి అవుతుంది. అంటే, మీకు లభించిన జ్ఞానాన్ని లేదా వివేకాన్ని మీరు గట్టిగా పట్టుకుని ఉన్నారని అర్థం. “ఇదంతా తాత్కాలికం, ఇదంతా నశ్వరమైనది, ఈ ప్రపంచమంతా క్షణికమైనది” - ఇదే ఆ జ్ఞానం. శాశ్వతమైనది, నిత్యమైనది ఏదైతే ఉందో, అది కంటికి కనిపించదు మరియు పంచేంద్రియాలకు అందనిది. ఈ జ్ఞానాన్ని మీరు పట్టుకుని, దానిని పోషించి, కాపాడుకున్నప్పుడు, అదే ‘గోపాల’ స్థితి. “నేను ఈ శరీరాన్ని కాను, నేను ఈ మనస్సును కాను, నేను ఈ ఆలోచనలను, భావోద్వేగాలను కూడా కాను” - ఇలాంటి అనుభూతి మీకు అప్పుడప్పుడు కలుగుతుంది కదా? కొన్ని ఆలోచనలు వచ్చినప్పుడు, “అరే, నేను ఈ ఆలోచనలను కాను. ఇవి నావి కావు. ఇవి నా ఆలోచనలు కావు, నేను వీటిని కాదు” అని మీకు అనిపిస్తుంది. కానీ, అటువంటి స్పృహ ఒక క్షణం వచ్చి, వెంటనే మాయమైపోతుంది. కొన్నిసార్లు మీకు ఇలా అనిపించవచ్చు: “నేను కేవలం ఒక అంతరాకాశం (ఎంప్టినెస్) వంటివాడిని; నాలో ఏదో ఒకటి ఉంది, అది ఏమాత్రం మారలేదు”. కానీ, ఇది ఒక మెరుపులా వచ్చి, మళ్ళీ మీరు దానిని మర్చిపోతారు. “నేను మారలేదు, మిగిలినవన్నీ మారాయి” - ఇలా మారకుండా ఉన్న దానిని గుర్తించి, దానితో మమేకమై, దానిని గట్టిగా పట్టుకుని ఉండటమే ‘గోపాల’ తత్వం.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ





రద్దీరహిత నగరంగా భాగ్యనగరం

ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలి
చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు
అవసరానికి తగ్గట్లు గ్రీన్ ట్యాంకర్లు
అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

ప్రజా దీవెన, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్‌గా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు

మిగతా 2 లో

ఆటలు ముగిసినా వసతులు నిలవాలి

ఖేలో ఇండియాకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు..
గ్రూప్-1 స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు
ఖేలో సమీక్షలో అధికారులకు రేవంత్ దిశానిర్దేశం

02

కాంగ్రెస్‌ను కాటికి పక్కా పంపిస్తాం

తెలంగాణలోనూ ఖాతాతెరుస్తాం

ప్రతి చొరబాడుదారున్ని చెరబట్టేందుకు ప్రతిన

మూడు కోట్ల ఓట్లు అక్రమ వలసదారులవే
వారిలో ఒక్కరికీ ఓటు హక్కు దక్కనివ్వం
పది కోట్లు మరణించిన, చిరునామా మారిన వారివి
చొరబాటుదార్ల ఓట్లతో గెలవాలనుకుంటున్న కాంగ్రెస్
ఈవీఎంలు మోసమైతే రేవంత్ ఎలా గెలిచారు?
2014, 2019లో ఎస్ఐఆర్ లేకున్నా గెలిచాం
2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత మహారాష్ట్ర, హరియాణాల్లో గెలవలేదా?
దమ్ముంటే పార్లమెంటులో ఎస్ఐఆర్‌పై చర్చకు రండి
పన్నెండేళ్ల పాలనలో చారాణా కుంభకోణం లేదు
హైదరాబాద్ ర్యాలీలో అమిత్ షా వ్యాఖ్యలు



ప్రజా దీవెన, హైదరాబాద్ : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో తొలగించిన ఓట్లలో మూడు కోట్లు అక్రమ వలసదారులవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. వారంతా బంగ్లాదేశ్ చొరబాటుదారులని, వారిలో ఒక్కరికీ ఓటు హక్కు దక్కనివ్వబోమని ప్రకటించారు. ప్రతి చొరబాటుదారుడినీ ఓటర్ల జాబితా నుంచి, దేశం నుంచి బయటకు పంపిస్తామని స్పష్టం చేశారు. బోగస్

మిగతా 2 లో

మస్తుమస్తుగా మహాపాదయాత్ర

భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు..
యాత్రా మార్గంలో బీజేపీ, జాతీయ జెండాల ప్రదర్శన
సర్‌కు సంబంధించి ప్లకార్డులతో..
వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టే యత్నం
యాత్రకు ముందు భాగ్యలక్ష్మీ ఆలయంలో అమిత్‌షా ప్రత్యేక పూజలు

02



క్రాప్స్ కాదు కాంగ్రెస్ సెలవిద్దాం

కరెంట్, నీళ్లు ఇవ్వలేమన్న సర్కార్‌కు బుద్ధిచెబుదాం
కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకొంటరా?
కాంగ్రెస్ తెచ్చిన కరువుపై అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తాం
వనపర్తి జిల్లా అల్వాలలో ఎండిన పంటల పరిశీలన
రైతన్నల రణభేరిలో ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు

యాసంగిలో పంటలు వేసుకోవద్దు.. సాగునీళ్లు, కరెంటు ఇవ్వలేమం టున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హెచ్చరించారు.

03

సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం



రెండు శాఖలతో సంయుక్త రీ సర్వేలు
భూ వివాద రహిత తెలంగాణ లక్ష్యం : మంత్రి పొంగులేటి

రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు రీ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు.

03

ప్రతి లావాదేవీలోనూ పారదర్శకత

దేశానికే ఆదర్శంగా డిజిటల్ మార్కెట్ యార్డులు
ప్రతి లావాదేవీలోనూ పారదర్శకత: తుమ్మల



3



02

ప్రతిష్టాత్మకంగా ఇండియన్ రోడ్స్ సదస్సు

పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా నిర్వహణ..
రోజూ గంట పాటు కళాకారుల ప్రదర్శనలు
19న కేంద్ర మంత్రి గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డి
సదస్సును ప్రారంభిస్తారు: మంత్రి కోమటిరెడ్డి
ఐఆర్‌సీ నిర్వహణకు 12 కమిటీల నియామకం

రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కోసం శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌ను కాటికి పక్కా పంపిస్తాం



మొదటి పేజీ తరువాయి

ఓట్లు, చొరబాటుదారుల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటోందని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ నుంచి మొజంజాహీ మార్కెట్ వరకు సాగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఢిల్లీలో జరిగింది ఓట్ బచావో ర్యాలీ కాదని, చొరబాటుదారులను కాపాడే 'ఘుస్‌పైటియా బచావో' ర్యాలీ అని విమర్శించారు. ఓటర్ల జాబితాలో బంగ్లాదేశ్ చొరబాటు దారులకు చోటు కల్పించేందుకే ర్యాలీ తీశారని ఆరోపించారు.పది కోట్ల వారివే ఎస్ఐఆర్‌లో 13 కోట్ల ఓట్లు తొలగించారన్న రాహుల్ ఆరోపణపై స్పందించిన షా.. పది కోట్ల ఓట్లు మరణించిన, చిరునామా మార్చిన, రెండుచోట్ల నమోదైన వారివేనని చెప్పారు. 6.25 కోట్ల మంది వేరేచోట నివాసం ఉంటున్నారని, వారికి రెండుచోట్ల ఓట్లు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. దాదాపు మూడు కోట్ల మంది చనిపోయారని, చనిపోయినవారి ఓట్లు తొలగించాల్నా, వద్దా? అని నిలదీశారు. 'సర్' లేకుండానే గెలిచాంఎసఐఆర్ వల్లే బీజేపీ గెలిచిందంటున్న కాంగ్రెస్ ఎస్ఐఆర్‌కు ముందు చాలా ఎన్నికలు తాము గెలిచిన విషయం గుర్తు చేసుకోవాలని అమిత్‌షా అన్నారు. 2014, 2019లలో ఎస్ఐఆర్ లేకున్నా మోదీ గెలిచారని చెప్పారు. 2024 తర్వాత మహారాష్ట్ర, హరియాణాలో భారీ మెజారిటీతో గెలిచామని, ఢిల్లీలో ఏళ్ల తర్వాత విజయం సాధించామని, బిహార్, అసోంలోనూ గెలిచామని, బెంగాల్‌లో మమతను అధికారం నుంచి తప్పించామని అన్నారు. తెలంగాణలోనూ గెలిచి అధికారంలోకి వస్తామని ప్రకటించారు.ఈవీఎంల మోసమైతే.. తాము ఈవీఎంల మోసం చేస్తే రేవంత్ సీఎం ఎలా అయ్యారని షా ప్రశ్నించారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వచ్చిందని, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వాలు ఎలా వచ్చాయని నిలదీశారు. గెలిస్తే ప్రజల ఓట్లతో, ఓడితే ఈవీఎంల వల్లేనా? అని ప్రశ్నించారు. రాహుల్‌కు ఏటీఎంగా తెలంగాణ రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ అమలవుతోందని అమిత్‌షా అన్నారు. అది రేవంత్ ద్వారా రాహుల్‌గాంధీకి చేరుతోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకుందన్న మండిపడ్డారు. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు కాంగట్రస్‌ను ఎప్పటికీ క్షమించరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇచ్చి విస్మరించిందని, అవన్నీ 'చపాచట్' అయిపోయాయని ఎద్దేవా చేశారు.మాక్ పార్లమెంటులోనే ప్రధానిరాహుల్‌గాంధీ మాక్ పార్లమెంటులోనే ప్రధాని కాగలరని షా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి ఆయన విదేశాలకు వెళ్తుంటారని, ఎన్నికల్లో గెలవాలంటే దేశంలో ఉండి చెమటోడ్చాలని చురకలంటించారు. చేతిలో రాజ్యాం గం పెట్టుకుని రాజ్యాంగాన్ని గౌరవించరని విమర్శిం చారు. పార్లమెంటు సమావేశాలు జరగకుండా అడ్డుకుంటున్నారని ఆక్షేపించారు. దమ్ముంటే పార్లమెంటులో ఎస్ఐఆర్‌పై చర్చించాలని సవాల్ విసిరారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. చర్చలో ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను చీల్చి చెండాడుతారని వ్యాఖ్యానించారు.

పావలా కుంభకోణం కూడా లేదు

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లు కుంభకోణాలేనని, ఏకంగా రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు చేశారని అమిత్‌షా ఆరోపించారు. వారి చేతుల్లో మళ్లీ ప్రభుత్వం పెడదామా? అని ప్రజలను ప్రశ్నించారు. 12 ఏళ్ల మోదీ పాలనలో పావలా కుంభకోణం కూడా జరగలేదని, మోదీపై ఆరోపణలే లేవని అన్నారు. వెంటిలేటర్‌పై కాంగట్రప్రదేశంలో కాంగ్రెస్ క్రమంగా కనుమరుగవుతోందని షా వ్యాఖ్యానించారు. తమిళనాడులో 64 ఏళ్లుగా, బెంగాల్‌లో 54 ఏళ్లుగా, గుజరాత్, యూపీలో 40 ఏళ్లుగా, త్రిపురలో 26 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలో లేదని ప్రస్తావించారు. ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ వల్లే ఓడిపోయారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉందని, అది మోదీతో పరిగెత్తలేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ యువమోర్చా అధ్యక్షుడు కూడా రాహుల్‌ను ఓడించగలరని అన్నారు. హామీలు నిలబెట్టుకున్నాంఅధికారంలోకి వస్తే ఆర్టికల్ 370 రద్దు చేస్తామని, రామమందిరం కడతామని, త్రిపుల్ తలాక్ రద్దు చేస్తామని చెప్పామని, అన్నీ చేశామని షా ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్, సర్జికల్ స్ట్రైక్‌చేశామని, నక్సలైట్లను నిర్మూలించామని చెప్పారు. 2029 డిసెంబరు 31 లోగా దేశాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తామని ప్రకటించారు. దేశంలో 50 కోట్ల మందికి రూ.5 లక్షల వరకు ఉచిత బీమా, 16 కోట్ల ఇళ్లకు నీళ్లు, 13 కోట్ల మందికి పీఎం కిసాన్ నిధి, 12 కోట్ల మరుగుదొడ్లు, 10 కోట్ల ఉజ్వల గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని తెలిపారు.మోదీ ఒక్కరే అడ్డుకోగలరురేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అమ్మడానికి జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్, ఓవైసీ, బీఆర్ఎస్ అడ్డుకోగలవా? అని అమిత్‌షా ప్రశ్నించారు. నరేంద్ర మోదీ మాత్రమే ఈ దోపిడీని అడ్డుకోగలరన్నారు. ఎన్డీఏ పార్టీలు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్‌పై వాస్తవాలు వివరించాలని అమిత్‌షా సూచించారు. తెలంగాణలో భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆ రోజు నిజాం మెడలు వంచకపోతే ఈ రోజు హైదరాబాద్ దేశంలో భాగం అయ్యేది కాదని వ్యాఖ్యానించారు. ర్యాలీలో పాల్గొన్నవారికి ధన్యవాదాలు తెలిపారు. భాగ్యలక్ష్మి అమ్మవారికి సభావేదిక నుంచి నమస్కరించారు. అంతకుముందు భారత్‌మాతాకీ జై నినాదాలు చేయించగా సభికులు సరిగా స్పందించక పోవడంతో.. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలా, వద్దా?అనిప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్నిపెకిలించేలా నినాదాలు చేయాలని పిలుపునిచ్చారు.

పూజలు చేయడం నా అదృష్టం: షా

భాగ్యలక్ష్మీ అమ్మవారికి పూజలు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖ శాంతులు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలని అమ్మవారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిఇంగ్లిష్, తెలుగులోనూ పోస్టు చేశారు.

మస్తుమస్తుగా మహాపాదయాత్ర

భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు..

యాత్రా మార్గంలో బీజేపీ, జాతీయ జెండాల ప్రదర్శన

సర్‌కు సంబంధించి ప్లకార్డులతో..

వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టే యత్నం

యాత్రకు ముందు భాగ్యలక్ష్మీ ఆలయంలో అమిత్‌షా ప్రత్యేక పూజలు

ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు ఎక్స్‌లో పోస్ట్



'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం–అరాచకత్వాన్ని అంతం చేద్దాం' నినాదంతో సోమవారం భాగ్యనగరంలో బీజేపీ నిర్వహించిన మహా పాదయాత్రకు భారీ స్పందన లభించింది. గ్రేటర్‌తో పాటు పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. దీంతో బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు యాత్రా మార్గం కాషాయమయంగా మారిపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొనగా... ఆయన వెంట కేంద్రబొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఉన్నారు. దారి పొడవునా మోదీ నినాదాలతో, సర్ ప్రక్రియకు సంబంధించిన పలు రకాల ప్లకార్డులను ప్రదర్శిస్తూ, జాతీయ జెండా, బీజేపీ జెండాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొన్నారు.

ప్రత్యేక విమానంలో నగరానికి..

ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.15 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అమిత్‌షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం అమిత్‌షా మధ్యాహ్నం 1.14 గంటలకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హోంమంత్రి పర్యటన నేపథ్యంలో చార్మినార్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.10 గంటలకు నిజాం కాలేజీ సమీపంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన బీజేపీ మహా పాదయాత్ర, చాపల్‌రోడ్, అబిడ్స్ చర్మాస్, చౌరస్తా మీదుగా ఎంజే మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర కొనసాగింది.

భద్రతా కారణాల రీత్యా సాయంత్రం 4.14 గంటలకు గన్‌పౌండ్రీ ఎస్‌బీఐ చౌరస్తా వద్ద మహా పాదయాత్రలో అమిత్‌షా వచ్చి చేరారు. అక్కడి నుంచి మోజాంజాహి మార్కెట్ క్రాస్‌రోడ్ వరకు నడిచారు. యాత్రా మార్గంలో ఇరువైపుల ఉన్న బహుళ అంతస్తుల భవనాలపైకి అభిమానులు చేరి.. జై శ్రీరామ్, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. బోనాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్య కళాకారుల ప్రదర్శనలు, విన్యాసాలు పాదయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, గోరక్షక దళ్, సంఘ్ పరివార్ సంస్థల నాయకులు.. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ మెడికల్ సెల్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను అంపశయ్యపై పెట్టి యాత్రలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ జోన్ జిల్లా డీసీపీ శిల్పవల్లి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో.. మహాపాదయాత్ర ప్రశాంతంగా ముగిసింది. బషీర్‌బాగ్ చౌరస్తా, నాంపల్లి లిబర్టీ వైపు నుంచి వచ్చే వాహనాలను నిలిపివేయకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. 5.05 గంటలకు ప్రసంగం ముగిసిన అనంతరం అమిత్‌షా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు.

రద్దీరహిత నగరంగా భాగ్యనగరం

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని వివిధ ఇండస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్‌తోపాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగిస్తే తాగునీటి ఆదా చేయొచ్చని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీతో పాటు, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సూచించారు. ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఆటలు ముగిసినా వసతులు నిలవాలి

ఖేలో ఇండియాకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు..

గ్రూప్-1 స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు

ఖేలో సమీక్షలో అధికారులకు రేవంత్ దిశానిర్దేశం

ప్రజా దీవెన, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కోసం శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలని, పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలని సూచించారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు జరిగే 8వ ఎడిషన్ పోటీల ఏర్పాట్లపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా ఈ పోటీలను గొప్ప అవకాశంగా మలుచుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని సీఎం అన్నారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఖేలో ఇండియా పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఈవెంట్‌ను అవకాశంగా తీసుకొని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సీఎం పేర్కొన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కోసం సమకూర్చినవనరులన్నింటినీ ఖేలో ఇండియా పోటీలకూ ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సమ్మిట్ ముగిసిన రెండు రోజులకే ఖేలో ఇండియా పోటీలు మొదలవుతాయని, సమ్మిట్‌లో పెట్టుబడుల ఆకర్షణ కూడా ఒక భాగమైనందున అధికారులందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూసేందుకు గ్రూప్–1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల దశ నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని సీఎం ఆదేశించారు. వివిధ జిల్లాల్లో జరిగే పోటీల ఏర్పాట్ల పర్యవేక్షణకు ఆయా చోట్ల పని చేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్–1 అధికారులను నియమించాలన్నారు. క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపై సమాచారం ఇవ్వాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడల కోసం కొన్నిచోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు, పోటీలు ముగిసిన కొన్నేళ్లలోనే విచ్ఛిన్నమయ్యాయని తెలిపారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో పోటీల ప్రారంభ, ముగింపు వేడుకల్లో ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ప్రారంభోత్సవం గచ్చిబౌలి స్టేడియంలో, ముగింపు వేడుక ఎల్‌బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఉండవచ్చు. ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.

6 నగరాలు.. 20 వేదికలు..

ఖేలో ఇండియా పోటీల కోసం ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులతో పాటు సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు రాష్ట్రానికి రానున్నారు. హైదరాబాద్ సహా 6 నగరాల్లో 20 వేదికల్లో 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. హనుమకొండలో అథ్లెటిక్స్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ, మహబూబ్‌నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్ జరగనుండగా, మిగతా పోటీలు హైదరాబాద్‌లోని ప్రధాన వేదికల్లో జరుగుతాయి. హుస్సేన్ సాగర్‌లో రోయింగ్, కయాకింగ్, కనోయింగ్ పోటీలు నిర్వహించనుండగా, సెయిలింగ్‌ను డెమో క్రీడగా చేర్చారు. ఈ వేదికల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. క్రీడాకారుల డ్రెస్సింగ్ గదులు, ప్రేక్షకుల గ్యాలరీలు, వాష్‌రూమ్‌లు, ఈత కొలనులు, సైక్లింగ్ ట్రాక్‌లు, షూటింగ్ రేంజ్‌ల మెరుగుదల పనులు వీటిలో ఉన్నాయి. పోటీల కోసం కేంద్రం రూ.22 కోట్లు విడుదల చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ కర్రసాము క్రీడను ఆతిథ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చేలా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లోని ఖేలో ఇండియా శిబిరాల్లో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని వివరించారు. సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ(స్పోర్ట్స్) వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి లావాదేవీలోనూ పారదర్శకత

దేశానికే ఆదర్శంగా డిజిటల్ మార్కెట్ యార్డులు

ప్రతి లావాదేవీలోనూ పారదర్శకత: తుమ్మల

ప్రజా దీవెన, హైదరాబాద్: రాష్ట్రంలోని మార్కెట్ యార్డు వ్యవస్థను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతతో అనుసంధానించి, దేశానికే ఆదర్శంగా నిలిచే డిజిటల్ మార్కెట్ యార్డులుగా మార్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతు పండించిన పంటకు సరైన ధర అందించడంతో పాటు మార్కెట్ యార్డు క్రయవిక్రయాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే ఈ డిజిటల్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఐటీ శాఖతో సమన్వయం చేసుకుని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను వారం రోజుల్లోగా ఆహ్వానించాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... రైతు తన పంటను మార్కెట్ యార్డుకు తీసుకువచ్చినప్పటి నుంచి విక్రయం ముగించుకుని, నగదు చెల్లింపులు పొంది బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రైతు వివరాల నమోదు, ప్రతి పంట లాట్‌కు ప్రత్యేక ఐడీ కేటాయింపు, డిజిటల్ బిడ్డింగ్, టెండర్ నమోదు, పంట నాణ్యత పరీక్ష, ఆన్‌లైన్ వేలం, ధర నిర్ణయం, పంట తూకం, అమ్మకపు బిల్లుల తయారీ, మార్కెట్ ఛార్జీల లెక్కింపు, గేట్ ఎగ్జిట్ పాస్‌లు, రసీదులు, ఈ–పర్మిట్ల జారీ వరకు అన్ని ఒకే వేదికపై జరగాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న కోహెడ ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశ పనులను పూర్తిచేయాలని తుమ్మల అధికారులను ఆదేశించారు.

ప్రతిష్టాత్మకంగా ఇండియన్ రోడ్స్ సదస్సు



పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా నిర్వహణ..
రోజూ గంట పాటు కళాకారుల ప్రదర్శనలు
19న కేంద్ర మంత్రి గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డి సదస్సును ప్రారంభిస్తారు: మంత్రి కోమటిరెడ్డి
ఐఆర్‌సీ నిర్వహణకు 12 కమిటీల నియామకం

ప్రజా దీవెన, హైదరాబాద్ : తెలంగాణ అభివృద్ధిని ప్రపంచానికి చాటేలా ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ సదస్సును నిర్వహించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు హైటెక్స్‌లో నిర్వహించే సదస్సు గురించి దేశంలోని ప్రధాన నగరాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం రేవంత్ చేతుల మీదుగా సదస్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని పనులు, ఐఆర్‌సీ సదస్సు ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను దేశ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసే వేదికగా ఐఆర్‌సీని నిర్వహించాలన్నారు. సదస్సుకు హాజరయ్యే అతిథులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసేలా ప్రాంగణంలో 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో 'తెలంగాణ పెవిలియన్'ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రతి రోజూ తెలంగాణ ఆత్మగౌరవం, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక కళా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. రోజూ గంటపాటు కళాకారులతో ప్రదర్శనలు ఉండేలా చూడాలని, రాష్ట్ర ప్రత్యేకతను గుర్తు చేసేలా జ్ఞాపికలు అందించాలని సూచించారు. పర్యాటక శాఖ సమన్వయంతో సదస్సుకు వచ్చే అతిథులు, తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు.. ప్రీ సమ్మిట్‌గా ఐఆర్‌సీ నిలవాలని, రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఐఆర్‌సీలో రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన కీలక ప్రకటనలు ఉంటాయని పేర్కొన్నారు.

12 కమిటీల నియామకం

ఐఆర్‌సీ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 12 కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్లు, భోజనాల సదుపాయాలు, రిసెప్షన్– రవాణా, వసతి, ఆర్థిక/రెవెన్యూ వ్యవహారాలు, టెక్నికల్ సెషన్స్, కొనుగోలుదారులు/విక్రయదారుల సమావేశాలు, ప్రచారం, సావనీర్, సాంస్కృతిక ప్రదర్శనలు, మెడికల్–ప్రోటోకాల్, వెబ్‌సైట్–ఐటీసీ, పర్యాటక ప్రదేశాల పర్యటనలు, వేదిక నిర్వహణకు వేర్వేరుగా కమిటీలను నియమించారు. ఇందులో రవాణా–రిసెప్షన్ కమిటీకి బి.వెంకటేశ్వరరావు, ఐ.నర్సింగరావును చైర్మన్లుగా నియమించగా, మరో 11 కమిటీలకు 11 మంది చైర్మన్లుగా వ్యవహరించనున్నారు. అలాగే, 25మంది కో చైర్మన్లు, సభ్యులుగా ఉంటారు.

నిమ్స్‌లో 4 రోజులుగా ఏసీబీ వరుస తనిఖీలు

సర్జికల్ స్టోర్స్‌లో రికార్డుల పరిశీలన

మందులు, సర్జికల్ పరికరాల కొనుగోళ్లపై ఆరా

ప్రజా దీవెన, హైదరాబాద్ : నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి, అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు మరింత ముమ్మరం చేసింది. నాలుగు రోజులుగా వరుసగా తనిఖీలు జరుపుతోంది. ఏసీబీ ప్రత్యేక బృందాలు ఆసుపత్రిలోని పలు విభాగాల్లో సోదాలు నిర్వహిస్తున్నాయి. డీఎస్పీల నేతృత్వంలో వేర్వేరు బృందాలుగా ఏర్పడి పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలిస్తున్నారు. సోమవారం జరిపిన తనిఖీల్లో నిమ్స్ సర్జికల్ స్టోర్స్‌లో రికార్డులు పరిశీలించారు. రెండు దశాబ్దాలుగా ఆసుపత్రిలో కొనుగోలు చేసిన సర్జికల్ పరికరాలకు సంబంధించిన బిల్లులు, పేషెంట్లకు ఉపయోగించినట్లు రికార్డుల్లో పొందుపర్చిన వివరాల్ని సరిచూస్తున్నారు. కొనుగోళ్లు, వినియోగానికి మధ్య చాలా వ్యత్యాసం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్లను కూడా ఏసీబీ ప్రత్యేక బృందాలు సోమవారం పరిశీలించాయి. థియేటర్లలో ఉపయోగిస్తున్న యంత్రాలు, పరికరాలు, వాటి కొనుగోళ్లు, బిల్లులకు సంబంధించి ఆరా తీశాయి. ప్రత్యేకంగా ఓ వైద్య బృందం సహకారం తీసుకుని అన్ని అంశాల్ని పరిశీలించి రికార్డులు, బిల్లులు పరిశీలిస్తున్నారు. మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లు, వాటి నిల్వలు, వినియోగం, సరఫరాకు సంబంధించిన రికార్డులపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నారు. రికార్డుల్లో పేర్కొన్న నిల్వలకు, వాస్తవంగా ఉన్న నిల్వలకు మధ్య వ్యత్యాసాలు, కొనుగోళ్లలో నిబంధనలు పాటించారా లేదా వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. క్యాంటీన్, సెక్యూరిటీ కాంట్రాక్టుల మొదలుకొని ఆపరేషన్ థియేటర్ వరకు పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలపై ఏసీబీ కీలక ఆధారాలు సేకరిస్తుంది. నిమ్స్‌లో రెండు దశాబ్దాలుగా స్టోర్ ఇన్‌చార్జీలుగా పనిచేసిన నలుగురు మాజీ ఉద్యోగుల్ని పిలిపించి వారి నుంచి సమాచారం సేకరించి స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు తెలిసింది.

వద్దన్నా నైట్ డ్యూటీకి వెళ్లిందని.. సహజీవనం చేస్తున్న మహిళ కొడుకును చంపిన ప్రియుడు

హైదరాబాద్‌లోని బోరబండలో దారుణం

ప్రజా దీవెన, హైదరాబాద్ :: తనతో సహజీవనం చేస్తున్న మహిళ తన మాట వినకుండా నైట్ డ్యూటీకి వెళ్లిందనే కోపంతో ఆమె ప్రియుడు.. గదిలో నిద్రపోతున్న ఆమె కొడుకును గొంతు నులిమి దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని బోరబండలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దుర్గకు ఆరేళ్ల క్రితం పవార్ మధు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వారికి కుమారుడు విజయ్ (5) ఉన్నాడు. కొడుకు పుట్టిన ఏడాదికే మధు మరణించాడు. ఈ క్రమంలో దుర్గకు నగరంలో నిజామాబాద్‌కు చెందిన విద్యాసాగర్‌తో ఏడాదిన్నర క్రితం పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా ఇద్దరు సహజీవనం చేస్తున్నారు.

హఫీజ్‌పేట్‌లోని ఓ హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థలో నైట్‌డ్యూటీ చేస్తున్న దుర్గ.. మూడు నెలలుగా బోరబండ ఆజంనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ప్రియుడు విద్యాసాగర్, కొడుకు విజయ్‌తో కలిసి ఉంటోంది. ఆదివారం రాత్రి.. నైట్ డ్యూటీకి వెళ్లొద్దని దుర్గతో విద్యాసాగర్ వాదించాడు. మానడం కుదరదని, ఉద్యోగం నుంచి తీసేస్తారని చెప్పి.. కొడుకును ఇంట్లో పడుకోబెట్టి పనికి వెళ్లింది. సోమవారం ఉదయం పని నుంచి ఇంటికి వచ్చేసరికి కుమారుడు విజయ్ విగతజీవిగా పడి ఉండడంతో దుర్గ బోరున విలపిస్తూ అరిచింది. దీంతో విద్యాసాగర్ పరారయ్యాడు. దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

క్రాప్స్ కాదు కాంగ్రెస్ సెలవిద్దాం

కరెంట్, నీళ్లు ఇవ్వలేమన్న సర్కార్‌కు బుద్ధిచెబుదాం
కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకొంటరా?
కాంగ్రెస్ తెచ్చిన కరువుపై అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తాం
వనపర్తి జిల్లా అల్వాలలో ఎండిన పంటల పరిశీలన
రైతన్నల రణభేరిలో ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు



ప్రజా దీవెన, మహబూబ్‌నగర్ : యాసంగిలో పంటలు వేసుకోవద్దు.. సాగునీళ్లు, కరెంటు ఇవ్వలేమం టున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హెచ్చరించారు. పంటలకు సెలవు అంటున్న రేవంత్‌రెడ్డికి మనమే శాశ్వతంగా సెలవు చెప్పేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కరువు మం డలాలను ప్రకటించినా, రైతులను ఆదుకునే విషయమై గురించి మాట్లాడటం లేదని మం డిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను కాపాడాల్సింది పోయి భయపెడుతున్నారని ఆగ్ర హం వ్యక్తంచేశారు. ఆయనకు కమీషన్లు, పర్సంటేజీల మీద తప్ప ప్రజల మీద ప్రేమ లే దని దుయ్యబట్టారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల సమీపంలో ఎండిపోయిన పంటలను హరీశ్‌రావు పరిశీలించారు. అనంతరం రైతన్నల రణభేరి బహిరంగ సభకు హాజరై సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. కరువు వచ్చిందని భయపెట్టడం కాదు.. రైతులను ఎలా ఆదుకుంటారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మరో 15 రోజులు జూరాల ఆయకట్టుకు సాగునీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలని సూచించారు.రాష్ట్రంలో ఇంత కరువుంటే కేంద్ర బృందం ఎందుకు రాలేదని బీజేపీ నేతలను ప్రశ్నించారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బృందం వచ్చి నష్టపరిహారం లెక్కవేస్తుంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు, నాయకులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.

కృష్ణాజలాల వినియోగంపైనా నిలదీస్తాం

కరువు, కృష్ణానది జలాల వినియోగంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కృష్ణా జలాలు ఒక్కో ఏడాది 28%, 27%, 25% మాత్రమే వాడుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అత్యధికంగా 41శాతం వినియోగించుకున్నట్టు గుర్తుచేశారు. రైతులకు ఆదుకునేదాకా ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు.కేసీఆర్ ఆ నాడు 10లక్షల ఎకరాలకు నీళ్లిస్తే.. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ఈ మూడేండ్లలో ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? అని హరీశ్ ప్రశ్నించారు.

ఎండిన పంటలను పరిశీలించిన హరీశ్

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల్‌లో సాగునీళ్లు లేక కరెంటు సరిగా రాక పంటలు ఎండిపోయి నష్టపోయిన గ్రామ రైతాంగాన్ని సోమవారం హరీశ్‌రావు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. 400 ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయని, రూ. లక్షలు పెట్టుబడి పెట్టినా చిల్లిగవ్వ కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతుల పరిస్థితిని చూసి మాజీ మంత్రులు చలించిపోయారు.

వచ్చేది కేసీఆర్ రాజ్యమే : సింగిరెడ్డి

రేవంత్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, త్వరలోనే కేసీఆర్ రాజ్యం రాబోతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరోనా కష్టకాలంలో కూడా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. వానల్లేక కరువు వచ్చిందని ప్రభుత్వం బూటకపు మాటలు చెబుతున్నదని, శ్రీశైలానికి 240 టీఎంసీల వరద వచ్చినా ఈ ప్రభుత్వానికి సోయిలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడు తూ రాష్ట్రంలో కరువు సంభవిస్తే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఢిల్లీ బాట పట్టారని మండిపడ్డారు. ఢిల్లీలోని ఓ హోటల్‌లో బస చేసిన మంత్రి, ఓ ఎమ్మెల్యే మూటల పంచాయితీతో కొట్టుకున్నారని ఆరోపించారు. కాగా ఏదుల మండలకేం ద్రానికి చెందిన మాజీ సర్పంచ్ జిల్లెల శ్రీనివాస్‌రెడ్డి అల్వాల సభలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి సమక్షంలో 300 మంది నాయకులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం

రెండు శాఖలతో సంయుక్త రీ సర్వేలు

భూ వివాద రహిత తెలంగాణ లక్ష్యం : మంత్రి పొంగులేటి

ప్రజా దీవెన, హైదరాబాద్ : రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు రీ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని, రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో సంయుక్త రీ సర్వేలు నిర్వహించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో పని చేస్తున్నామని, భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని తెలిపారు. రెవెన్యూ, అటవీ విభాగాలు క్షేత్ర స్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని, కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, అటవీ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. క్షేత్ర స్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావులేకుండా స్పష్టమైన హద్దులను నిర్ధారించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు పొడిగించాలి

సీఈవో సుదర్శన్‌రెడ్డికి కల్వకుంట్ల కవిత వినతి


ప్రజా దీవెన, హైదరాబాద్ : ఎక్కువ మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువును పొడిగించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. ఈ మేరకు సోమవారం సీఈవో కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని వినతిపత్రం అందజేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు ఈనెల 6తో ముగుస్తుందని.. అయితే, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ కొనసాగే వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కొత్త పార్టీలు తమ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఎమ్మెల్సీ ఎన్నికలు మంచి అవకాశమని పేర్కొన్నారు. జెన్‌జీలు, గ్రాడ్యుయేట్లు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతుండటం.. పోటీ చేసే అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారిందని.. ఈ ప్రక్రియలో మార్పు తీసుకురావాలని ఎన్నికల కమిషన్‌ను కోరామని అన్నారు. అలాగే, పెద్ద విద్యాసంస్థల యజమానులు తమ సంస్థల్లోనే భారీగా ఓటర్లను నమోదు చేయించుకుంటూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని.. వీటిపైనా సీఈవో దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించండి

తమ "తెలంగాణ రక్షణ సేన" (టీఆర్ఎస్) పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్‌లో ఉందనే విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు కవిత తెలిపారు. ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాడుతున్న తీరును కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో అందించి, రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని కోరినట్లు వెల్లడించారు.

గే యాప్‌లో దోస్తీ.. రూ.18 లక్షలు పాయె..!

జడ్చర్ల యువకుడికి ఏపీ వాసి టోకరా



జడ్చర్ల, నవంబరు 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలానికి చెందిన ఓ వ్యక్తికి గే యాప్‌లో ఏపీకి చెందిన వ్యక్తితో పరిచయమైంది. ఆ పరిచయం కాస్తా ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకునేదాకా వెళ్లింది. అక్కడ్నించి ఇద్దరూ అదేపనిగా మాట్లాడుకునేవారు. ఇదే అదనుగా ఏపీ వ్యక్తి జడ్చర్ల వాసి నుంచి రూ.18 లక్షలు కాజేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. బీఈడీ చదువుతున్న బాధితుడి ఖాతాలో ఉదండాపూర్ రిజర్వాయర్ పునరావాస పరిహారంలో భాగంగా రూ.18 లక్షలు జమవ్వగా.. రూ.6 లక్షలు ఖర్చు చేసుకున్నాడు. ఇటీవల ఓ గే యాప్‌లో చేరాడు. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా క్రోసూర్ మండలం దొడ్లేరుకు చెందిన తమ్మిశెట్టి నాగార్జునతో దోస్తీ కుదిరింది. జడ్చర్ల యువకుడి బలహీనతలను ఆసరాగా చేసుకున్న నాగార్జున.. తన తల్లికి ఆరోగ్యం బాగా లేదంటూ తొలుత రూ.200 తీసుకున్నాడు. అనంతరం 3 నెలల్లో ఏకంగా రూ.11.50 లక్షలు తన ఖాతాలోకి వేయించుకున్నాడు. మళ్లీ డబ్బులు కావాలని ఒత్తిడి చేశాడు. ఇవ్వకపోవడంతో బెదిరించాడు. దిక్కుతోచని బాధితుడు తన అక్క బంగారాన్ని కుదువబెట్టి రూ.2.50 లక్షలు, మరోసారి రూ.2.50 లక్షలు, వరుసకు సోదరుడి దగ్గర మరో రూ.1.50 లక్షలు అప్పుచేసి చెల్లించాడు. ఇలా మొత్తం రూ.18 లక్షలు ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వబోనని, మళ్లీ అడిగితే చంపేస్తానని నాగార్జున బెదిరించాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రూ.6 లక్షలు రికవరీ చేసినట్లు తెలిసింది.

ఫేస్‌బుక్‌లో పరిచయమై కానిస్టేబుల్‌కే టోకరా!

రూ.29.20 లక్షలు వసూలు చేసిన కిలేడీ!!

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా.. ట్రేడింగ్ మోసాల్లో పెద్ద సంఖ్యలో సామాన్యులు డబ్బు పోగొట్టుకుంటూనే ఉన్నారు. పోలీసు విభాగంలో పనిచేస్తూ... నేరాలతో పాటు సైబర్ నేరాలపై అవగాహన ఉన్న ఓ కానిస్టేబుల్ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.29.20 లక్షలు పోగొట్టుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆ కానిస్టేబుల్‌కు ఫేస్‌బుక్‌లో సుకన్యారెడ్డి పేరుతో ఓ మహిళ ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపింది. దాన్ని ఆమోదించిన అనంతరం తరచూ చాటింగ్ చేసుకుంటూ వాట్సప్‌లో నెంబర్లు ఇచ్చిపుచ్చుకొని సంభాషించుకోవడం ప్రారంభించారు. ఈ తరుణంలో సదరు మహిళ "దార్విన్ ఎక్స్ గ్లోబల్" ట్రేడింగ్ యాప్ ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు గడించవచ్చని సూచించింది. ఆ మాటలు నమ్మిన కానిస్టేబుల్.. తొలుత చిన్న మొత్తాలు పెట్టుబడి పెట్టాడు. అప్లికేషన్‌లో లాభాలు వచ్చినట్లు చూపడం, విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉండటంతో పలు దఫాలుగా రూ.29.20లక్షలు వేర్వేరు ఖాతాలకు పంపాడు. తక్కువ సమయంలోనే రూ.76 లక్షలు వచ్చినట్లు అప్లికేషన్‌లో చూపించడంతో ఆనంద పడ్డాడు. విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా... ట్యాక్స్, ఎక్స్చేంజ్ చార్జీలు, రిలీజింగ్ ఫండ్ మొత్తం రూ. 12 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు అతి భారీ వర్షాలు

2 జిల్లాలకు రెడ్, మూడింటికి ఆరెంజ్ అలెర్ట్ జారీ

నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు

సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, నవంబరు 2 : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడి, తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో నేడు రాష్ట్రంలోని ఒకటి రెండు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నల్గొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయంటూ ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ ఇచ్చింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

అంత దాపరికం ఎందుకు?

నీట్-పీజీ ప్రశ్నపత్రాలను అభ్యర్థులకు ఇవ్వకపోవడం,

ఆన్సర్ కీలను పరిమితంగా విడుదల చేయడంపై సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 2: నీట్-పీజీ పరీక్షల ప్రశ్నపత్రాలు, ఆన్సర్ 'కీ'ల విడుదల విషయంలో నేషనల్ బోర్డు ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) అనుసరిస్తున్న విధానంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నీట్-పీజీ పరీక్షల అన్సర్ 'కీ'లను పరిమితంగానే విడుదల చేయాలని ఎందుకు పట్టుబడుతున్నారో వివరణ ఇవ్వాలని సోమవారం ఆదేశించింది. అదేవిధంగా అభ్యర్థులు ప్రశ్నపత్రం కాపీని తమ వద్ద ఉంచుకోవడానికి అనుమతించడం పరీక్షల సమగ్రతకు ఏ విధంగా భంగం కలిగిస్తుందో రాతపూర్వక సమాధానం ఇవ్వాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కోరింది. పారదర్శకతలో భాగంగా ప్రశ్నపత్రం, అన్సర్ 'కీ'లను, పరీక్షలో అభ్యర్థులు ఇచ్చిన సమాధానాలను పూర్తిస్థాయిలో వెల్లడించడం, నీట్-పీజీ పరీక్ష-2026కు సంబంధించిన పలు ఇతర సమస్యలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఎన్‌బీఈఎంఎస్ తరపు న్యాయవాది నీమా వాదనలు వినిపిస్తూ.. సైన్స్ అయినందువల్ల నీట్ పీజీ క్వశ్చన్ బ్యాంక్ చాలా పరిమితంగా ఉందని, అది ఒక దేశ ఆస్తి వంటిదని పేర్కొన్నారు. ఏటా ప్రశ్నలను బయటపెట్టడం మొదలు పెడితే, రాబోయే ఐదారేళ్లలో తమ ప్రశ్నలన్నీ కోటాలోని కోచింగ్ సెంటర్లకు చేరుతాయని పేర్కొన్నారు.

పరుపు కింద డ్రగ్స్ పెట్టి.. కెమెరాకు చిక్కి!

పంజాబ్ శివసేన నేత ఇంట్లో పోలీసుల నిర్వాకం

సోదాకు ముందు ప్యాకెట్ పెట్టిన ఏఎసఐ

30 గ్రాముల హెరాయిన్ 'దొరికిందని' నేత అరెస్టు

చండీగఢ్, నవంబరు 2: డ్రగ్స్ కేసులో శివసేన నేతను ఇరికిద్దామని పంజాబ్ పోలీసులు వేసిన ఎత్తు రహస్య కెమెరాతో చిత్తయింది. ఆయన ఇంట్లో సోదాకు కొద్దిసేపటి ముందు సివిల్ దుస్తుల్లో ఇంట్లోకి వెళ్లిన ఓ ఏఎస్ఐ పరుపు కింద ప్యాకెట్ పెడుతున్న దృశ్యాలు ఇంట్లోని రహస్య కెమెరాలో రికార్డయ్యాయి. కాసేపటికే వచ్చిన పోలీసు బృందం సరిగ్గా అదే పరుపు కింద 30 గ్రాముల హెరాయిన్ దొరికిందంటూ నేతను అరెస్టు చేసింది. వీడియో బయటకు రావడంతో ఉన్నతాధికారులు తప్పనిసరై ఏఎఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌ను సస్పెండ్ చేశారు. అరెస్టయిన శివసేన నేత మహంత్ కశ్మీర్ గిరిని కేసు నుంచి తప్పించారు. తొలుత గిరి డ్రైవర్‌ను 7.5 గ్రాముల హెరాయిన్‌తో అరెస్టు చేశామని, అతడి విచారణలో గిరి పేరు బయటపడిందని పోలీసులు చెప్పారు. శనివారం మధ్యాహ్నం గిరి ఇంటికి సీఐఏ విభాగం ఏఎసఐ సుఖ్‌దేవ్ ఒంటరిగా వచ్చి ఓ గదిలోకి వెళ్లి పరుపు కింద ఏదో పెట్టి వెళ్లిపోయారు. తర్వాత స్థానిక ఇన్‌స్పెక్టర్, మరికొందరు అధికారులు సోదాకు వచ్చారు. నేరుగా ఏఎసఐ పరుపు కింద దాచిన చోటే హెరాయిన్ దొరికిందని ప్రకటించారు. ఆ తర్వాత కుటుంబం బయటపెట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసు అధికారులు స్పందించక తప్పలేదు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎస్పీ నేతృత్వంలో సిట్ ఏర్పాటైంది. ఏఎసఐ డ్రగ్స్ ఎక్కడి నుంచి తెచ్చారో తేలుస్తామని సీనియర్ ఎస్పీ అన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో పేలుడు

సల్ఫర్ ప్లాంటులో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా ప్రమాదం

ఉవ్వెత్తున ఎగసిపడిన మంటలు

మల్కాపురం(విశాఖపట్నం), నవంబరు 2 : విశాఖలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)లో సోమవారం రాత్రి ఆయిల్ ట్యాంకర్ వద్ద పేలుడు సంభవించింది. 'సల్ఫర్ ప్లాంటులో ట్రయల్ నిర్వహిస్తుండగా ట్యాంకు పేలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. భయపడాల్సిన పనిలేదు' అని కంపెనీ ప్రకటించింది. హెచ్‌పీసీఎల్ కూలింగ్ టవర్ సమీపంలో సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఆయిల్ ట్యాంకు వద్ద పేలుడు సంభవించింది. కమిషనింగ్ ప్రక్రియ పూర్తికాని నూతన సల్ఫర్ ప్లాంటులో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది. పోలీసు, అగ్నిమాపక శాఖతో పాటు పరిశ్రమల యజమాన్యాలు, హెచ్‌పీసీఎల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పేలుడు ఘటనతో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రమాదం వివరాలను అధికారుల నుంచి సేకరించామని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపుచేశారని చెప్పారు.

మూగజీవిపై అమానుషం!

ఆవుపై లైంగిక దాడి.. ఆపై హత్య.. ముగ్గురు వ్యక్తుల హేయమైన చర్య

కోనసీమ తిరుమల వాడపల్లిలో ఘటన

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

ఆత్రేయపురం నవంబరు 2 : సభ్య సమాజం తలదించుకోవాల్సిన.. మాటలకందని అత్యంత హేయమైన చర్య ఇది. ఓ మూగజీవంపై ముగ్గురు వ్యక్తులు అత్యంత క్రూరంగా ప్రవర్తించి హతమార్చిన ఘటన ఇది.. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో సోమవారం ఈ దారుణం జరిగింది. గంధం కేశవరావుకు చెందిన మకాం(పొలాల్లోని పాక)లో ఉన్న ఆవుపై ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన చేమకూర వెంకటరమణ, అమలాపురం రూరల్ మండలం బండార్లంకకు చెందిన అల్లవరపు శ్రీను వెంకన్న, కొత్తపేటకు చెందిన పల్లంరాజు ఈ నీచానికి పాల్పడ్డారు. తొలుత గోమాతపై అత్యాచారం చేసి.. యోని మార్గంలో గెడకర్రతో పొడిచి హతమార్చారు. మూగజీవి పట్ల క్రూరత్వానికి పాల్పడిన ఈ ముగ్గురినీ గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అయితే ఇద్దరు నిందితులను పోలీసులకు అప్పగించగా పల్లంరాజు. తప్పించుకుని పరారయ్యాడు. రైతు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.రాము కేసు నమోదు చేశారు.

అయితే.. విమానంలో ప్రయాణించకండి!

టికెట్ ధరల పెంపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణలో సుప్రీం వ్యాఖ్యలు

చార్జీలు 700% పెంచారు.. అత్యవసరంగా విచారించాలి: పిటిషనర్ తరపు న్యాయవాది

అయితే.. 'విమానంలో వెళ్లకండి' అన్న ధర్మాసనం ఉత్తర్వులివ్వకుండానే మరో కేసు విచారణ



న్యూఢిల్లీ : విమాన టికెట్ ధరలు దాదాపు 700 శాతం పెరిగాయని, వాటిని నియం 3 త్రించాలంటూ దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. విమాన టికెట్ ధరలు భారీగా పెరగడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ అపరేశ్కు మార్ సింగ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. విమాన టికెట్ ధరలు 700 శాతం పెరిగా యని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పగా.. 'అయితే విమానంలో వెళ్లకండి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విమాన ప్రయాణాన్ని అత్యవసర సేవగా పరిగణించాలని, ఈ ధరల పెరుగుదల రాజ్యాంగంలోని 14వ అధికరణ ఉల్లంఘన కిందకు వస్తుందని న్యాయవాది పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. 'అయితే విమానంలో వెళ్లకండి' అని వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే.. మరో కేసును విచారణకు తీసు కుంది. ఇదిలా ఉండగా పౌర విమానయాన రంగంలో పారదర్శకత, ప్రయాణికుల రక్షణ నిమిత్తం బలమైన స్వతంత్ర నియంత్రణ సంస్థ ఉండాలంటూ సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్ను ఇప్పటికే సుప్రీంకోరు విచారి స్తోంది. భారత్‌లోని ప్రైవేటు విమానయాన సంస్థలు టికెట్ ధరలను అనూహ్యంగా పెంచుతున్నాయని, ఇష్టారీతిన అనుబంధ చార్జీలను విధిస్తున్నాయని.. వాటిపై నియంత్రణ అవసరమని నారాయణన్ తన పిటిషన్లో పేర్కొన్నారు. ఇది విచారణ దశలో ఉండ గానే.. 700 శాతం ధరల పెంపుపై పిటిషన్ దాఖ .లైంది. మరోవైపు 'భారతీయ వాయుయాన్ అధిని యమ్' చట్టం కింద కొత్త నిబంధనలను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. విమాన టికెట్ ధరలపై గరిష్ఠ పరిమితి విధించనప్పటికీ అసాధారణ పరిస్థి తుల్లో అవసరమైతే జోక్యం చేసుకునే అధికారం ఈ చట్టంతో కేంద్రానికి లభించింది. కాగా, ఈ నెల 16న నిర్వహించనున్న తదుపరి విచారణ నాటికల్లా వాయుయాన్ అధినియమ్ నిబంధనలను ప్రచురిం చాలంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది.

ఐదు రాష్ట్రాల్లో 2.29 కోట్ల ఓట్లు ఫట్!

యూపీ, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్ మణిపుర్లలో వచ్చే ఏడాదే ఎన్నికలు

యూపీలోనే 2.04 కోట్ల ఓట్లకు ఎసరు

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో చేపట్టిన స్పెషల్ ఇంటె న్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో 2.29 కోట్ల ఓట్లు తొలగించారు. వీటిలో ఉత్తరప్రదేశ్(యూపీ), ఉ త్తరా ఖండ్, పంజాబ్, గోవా, మణిపుర్ రాష్ట్రాలు ఉన్నాయి. మొత్తంగా ఆయా రాష్ట్రాల్లోని ఓట్లలో 13.24 శాతం మేరకు కోతబడింది. ఈ మేరకు తాజాగా ఆయా రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు జాబితాలను వెలువరించారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో తగ్గిపోయిన ఓట్లలో ఒక్క యూపీ భాగమే 90 శాతం ఉండడం గమనార్హం. సర్ ప్రక్రియ చేపట్టక ముందు యూపీలో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సర్ రెండో దశ తర్వాత 12.56 కోట్ల మంది ఓటర్లు మాత్రమే మిగిలారు. అయితే.. కొన్ని అభ్యంతరా లను పరిశీలించి కొత్తగా చేర్చిన తర్వాత మొత్తంగా 2.04 కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగిం. చారు. పంజాబ్లో సర్ ప్రక్రియను మూడు దశల్లో చేపట్టారు. సర్కు ముందు 2.15 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. తర్వాత వీరి సంఖ్య 2.01 కోట్లుగా తేలింది. అంటే.. 14 లక్షల మంది ఓట్లను తొలగించారు. ఉత్త రాఖండ్లో 80 లక్షల మంది ఓటర్లు ఉండగా.. మూడుదశల్లో చేపట్టిన సర్ తర్వాత వీరి సంఖ్య 72 లక్షలకు చేరింది. ఫలితంగా 8 లక్షల మంది ఓట్లు కోల్పోయారు. మణిపుర్లో 20.9 లక్షల మంది ఓట ర్లకు గాను మూడు దశల సర్ తర్వాత 19.6 లక్షల మంది మాత్రమే జాబితాల్లో చోటు సంపాయించుకున్నారు. పంజాబ్లో చేపట్టిన సర్ ప్రక్రియలో 13 లక్షల మంది ఓటు హక్కును కోల్పోయారు. గోవాలో రెండు దశల్లో సర్ ప్రక్రియను చేపట్టగా 11.85 లక్షల మంది ఓటర్లకుగాను 10.58 లక్షల మంది ఓటర్లు మాత్రమే జాబితాల్లో చోటు సంపా యించుకున్నారు. ఇదిలావుంటే.. కొత్తగా ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేందుకు ఆయా రాష్ట్రాల్లోని వారికి జనవరి 1వ తేదీ వరకు అవకాశం కల్పిస్తు న్నట్లు పేర్కొన్నారు.

డెమోక్రాట్లు గెలిస్తే.. 'మిస్టర్ వీటో'గా మారతా!

బిల్లులన్నింటినీ తిరస్కరిస్తా.. దాంతో వాళ్లే దారికొస్తారు

మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీని ఓడించి ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి ఓటర్లు పట్టం కడితే తాను.. 'మిస్టర్ వీటో'గా మారుతానని ట్రంప్ హెచ్చరించారు. ఎన్నికల తర్వాత డెమోక్రాట్లు గెలిచి, కాంగ్రెస్ (అమెరికా చట్ట సభల)పై పట్టు సాధించినా కూడా వాళ్లు పంపించే బిల్లులను తాను ఆమోదించనని. వీటో చేస్తానని చెప్పారు. బిల్లులన్నింటినీ వీటో చేస్తుంటే వాళ్లే (డెమోక్రాట్లు) ఒకట్రెండు నెలల తర్వాత తలొగ్గుతా రని, దాంతో ఇరుపార్టీల మధ్య ఓ ఒప్పందం కుదురు తుందన్నారు. అయితే, ఇటువంటి పరిస్థితి వస్తుందని తాను అనుకోవటం లేదని చెప్పారు. కాగా, అమెరికా రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ పంపించే బిల్లులను అధ్యక్షుడు తిరస్కరించినా కూడా.. 2/3 మెజారిటీతో చట్టసభలు ఆమోదించుకునే వెసులుబాటు ఉంది.

అమెరికాలో భారతీయులు ఆందోళన చేస్తే ఊరుకుంటారా?

బాలీవుడ్ నటుడు ఇమ్రాన్హాష్మి బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం

ముంబై : అమెరికా పౌరుడై ఉండి.. సర్ను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ముంబైలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న బాలీవుడ్ నటుడు ఇమ్రాన్హాష్మి బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికాలో ఓ భారతీ యుడు ఇలాగే నిరసన తెలిపితే అక్కడి ప్రభుత్వం ఊరుకుంటుందా అని నిలదీసింది. సర్ అంశంపై మాట్లాడేందుకు, నిరసనలో పాల్గొనేందుకు ఆయనకు ఏ హక్కు లేదని స్పష్టం చేసింది. ఈసీకి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్నందుకు సీనియర్ నటుడు ఆమీర్ ఖాన్ మేనల్లుడైన ఇమ్రాన్హాష్మిని గత నెల 10న అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను దేశం విడిచి వెళ్లాలని ఆదేశిస్తూ లీవ్ ఇండియా నోటీసు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఇమ్రాన్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. తాజాగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్ చంద్ర త్రిపాఠి నేతృ త్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఇమ్రాన్ తరపు న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ అమెరికా లోనే పుట్టినప్పటికీ జీవితమంతా ఇండియాలోనే గడి పారని... ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు కలిగి ఉన్నారన్నారు. అయితే, ఓసీఐ కార్డు ఉన్నంత మాత్రాన భారత పౌరుల మాదిరి ఇక్కడ రాజకీయ నిరసనల్లో పాల్గొనలేరని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ క్రమం లోనే ఇమ్రాన్ హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఆందోళనల్లో పాల్గొనబోనని హామీనిచ్చారు. దీంతో, ఆయనపై జారీ అయిన లీవ్ ఇండియా నోటీ సును హైకోర్టు తాత్కాలికంగా నిలిపేస్తూ.. విచార ణను వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

అగంతుల ఆగడాలకు అమెరికా అతలాకుతలం

అమెరికాలో ఆగంతకుల కాల్పులు.. 24 మంది మృతి

11 రాష్ట్రాల్లో వేర్వేరు ఘటనలు

డాలస్లో 75 నిమిషాల్లో నలుగురి బలి

కాలిఫోర్నియాలో గర్భిణి మృత్యువాత

వాషింగ్టన్ : అమెరికాలో హాలోవీన్ వారాంతం నెత్తురోడింది. కాలిఫోర్నియా నుంచి డెలా వేర్ వరకు నైట్ క్లబ్లు, హాలోవీన్ దుకాణాలు, స్టేడియం పరిసరాలు, విశ్వవిద్యాలయాల సమీప ప్రాంతాల్లో కాల్పులు జరిగాయి. పోలీసు ప్రకటనల ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ వేసిన లెక్క ప్రకారం 11 రాష్ట్రాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో కనీసం 24 మంది మృతిచెందగా, 91 మంది గాయపడ్డారు. ఈ ఘటనల మధ్య సంబంధం ఉన్నట్లు గానీ, ఉగ్రకోణం ఉన్నట్లు గానీ అధికారులు ఇప్పటివరకు ప్రకటించు లేదు. టెక్సాస్లోని డాలస్ నగరం డీప్ ఎలమ్ వినోద ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు. 12.20 గంటలకు కాల్పులు మొదలయ్యాయి. 75 నిమిషాల వ్యవధిలో మూడు చోట్ల జరిగిన కాల్పుల్లో కనీసం నలుగురు మృతిచెందగా, 15 మంది గాయప డ్డారు. కాలిఫోర్నియాలోని ఫెయిర్ఫీల్డ్లో స్పిరిట్ హాలోవీన్ దుకాణంలో శుక్రవారం రాత్రి 8.30 గంట లకు జరిగిన కాల్పుల్లో 31 ఏళ్ల గర్భిణి మృతిచెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఆమె నలుగురు పిల్లల తల్లి. మిషిగన్లోని



మాడిసన్ హైట్స్లో మరో స్పిరిట్ హాలోవీన్ దుకాణంలో 21 ఏళ్ల యువకుడు కాల్పుల్లో మృతిచెందాడు. డెట్రాయిట్లో ట్రిక్ ఆర్ ట్రీటింగ్ ముగించుకుని, హాలోవీన్ దుస్తుల్లోనే ఇంటి వెనుక గదిలో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలిక ఛాతిలోకి తూటా దూసుకెళ్లింది. చిన్నారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఫ్లోరిడాలోని జాక్సన్విల్లో రెండు వేర్వేరు ఘటనల్లో 13 మందికి తూటాలు తగ లగా, ఇద్దరు మృతిచెందారు. పార్టీ కోసం వరుసలో నిల్చున్న 17 ఏళ్ల బాలిక దారితప్పిన తూటాకు బలైంది. కొన్ని గంటల తర్వాత ఓ ఇంటి పార్టీలో జరిగిన కాల్పుల్లో 20 ఏళ్ల యువకుడు మృతిచెందాడు. రెండు ఘటనలకూ ఘరణలే కారణమని అధికారులు తెలిపారు. మిసిసిపీ లోని జాక్సన్లో కాస్ట్యూమ్ పార్టీ జరుగుతున్న నైట్ క్లబ్లోకి ముసు గులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. డ్యాన్స్ ఫ్లోర్పై కాల్పులు జరపడంతో ఇద్దరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. మిషి గన్లోని ఫ్లింట్లో ఓ పార్టీలో ఒక మహిళ మృతిచెం దగా, ముగ్గురు గాయపడ్డారు. కాన్సస్లోని విచిటాలో నలుగురికి తూటాలు తగిలాయి. వారిలో కిటికీలోంచి బయటకు చూస్తున్న ఓ వ్యక్తి కూడా ఉన్నారు. టెక్సాస్ లోని ఎడిన్బర్గ్ సమీపంలో పుట్టినరోజు వేడుకలో ఏడుగురు గాయపడ్డారు. ఆర్కాన్సాస్ లోని లిటిల్ రాక్ సమీపంలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయప డ్డారు. విశ్వవిద్యాలయాల సమీపంలో, వర్సిటీ కార్యక్ర మాల వద్ద రెండు డజన్లకు పైగా మందికి తూటాలు తగిలాయి. అలబామాలోని బర్మింగ్హామ్లో మ్యాజిర్ సిటీ క్లాసిక్ ఫుట్బాల్ మ్యాచ్ తర్వాత లీజియన్ ఫీల్ వెలుపల జరిగిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, ఎని మిది మంది గాయపడ్డారు. 17 ఏళ్ల బాలుడిని ఆదుపు. లోకి తీసుకున్నారు.. డెలావేర్లో గంట వ్యవధిలో రెండు సామూహిక కాల్పుల ఘటనలు జరిగాయి.ఎలెండేల్లో బహిరంగ విందుపై జరిగిన కాల్పుల్లో తొమ్మిది మందికి తూటాలు తగలగా, 17 ఏళ్ల బాలిక మృతిచెందింది. యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్ సమీపం లోని నెవార్క్ మెయిన్ స్ట్రీట్లో ఆరుగురు గాయప. డ్డారు. ఇల్లినాయ్ లోని బ్లూమింగ్టన్లో ఇల్లినాయ్ వెస్టి యన్ యూనివర్సిటీ సమీపంలో కాల్పుల ఘటనలో, 19 ఏళ్ల యువతి మృతి చెందగా, మరో ఏడుగురు. గాయపడ్డారు. ఇండి యానా లోని బ్లూమింగ్టన్లో ఏడు గురు ఆస్పత్రి పాలయ్యారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు పట్టభద్రుల ఓటుతో గుణపాఠం చెప్పాలి

నిరుద్యోగులను, విద్యార్థులను, రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి: మల్లయ్య యాదవ్



ప్రజా దీవెన, కోదాడ: కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నివాస గృహంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన ం సమీక్ష మరియు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ , ఖమ్మం –నల్గొండ– వరంగల్ జిల్లాల బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి , ఎన్నికల పరిశీలకులు తిప్పన విజయ సింహారెడ్డి లు పాల్గొన్నారు. ఈసందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటు నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, గత నాలుగు వారాలుగా పార్టీ శ్రేణులు ప్రతి ఇంటి తలుపు తట్టి ఓటర్లను చైతన్యపరిచారని, గత ఉప ఎన్నికల్లో మొత్తం 4,65,000 ఓట్లు నమోదు కాగా, ఈసారి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల చొరవతో ఆ సంఖ్య ఇప్పటికే 5 లక్షలు దాటిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గతంలో 13,780 పైచిలుకు ఓట్లు ఉండగా, 2023 అక్టోబర్ 1 నాటికి డిగ్రీ పూర్తయిన వారికి అవకాశం కల్పించడంతో అదనంగా మరో 2 నుంచి 3 వేల ఓట్లుపెరిగి, మొత్తం 17 వేల ఓట్ల వరకు చేరే అవకాశం ఉందని అంచనా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులు, విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సింగరేణి, ప్రైవేట్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని, అలాగే రైతులకు కరెంట్, సాగునీరు, కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు లేవని, జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని, కేసీఆర్ గారు తెచ్చిన గురుకుల వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున మిగిలి ఉన్న ఈ కొద్ది రోజుల్లో విద్యావంతులు, మేధావులు ఫారం–18 నింపి తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ, ప్రస్తుత రాక్షస పాలనను అంతమొందించడానికి పట్టభద్రులు తమ ఓటును అస్త్రంగా వాడుతూ ఒక నిశ్శబ్ద విప్లవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి, భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వారికి ప్రజాదరణ లేదని స్పష్టం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

గీతాంజలి విద్యార్థుల రాష్ట్ర స్థాయి ప్రతిభ



శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారం లోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 8వ తరగతి కి చెందిన నిమ్మల మధుయశ్శి గౌడ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ లో అక్టోబర్ 15 నుండి 17 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని పార్టిసిపేషన్ సర్టిఫికేట్ సాధించింది. 9వ తరగతి విద్యార్థి ఎస్.విశ్వేష్ అక్టోబర్ 31న నల్లగొండ ప్రభుత్వ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగిన 32వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ – జిల్లా స్థాయి పోటీల్లో “Smart Plant Watering System with Solar” ప్రాజెక్టును ప్రదర్శించి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ సాధించాడు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల కరస్పాడెంట్ దొంతూరి పరమేశ్వర రావు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

కరాటేలో కోదాడ విద్యార్థుల పతకాల పంట



ప్రజా దీవెన, కోదాడ: ఖమ్మం పట్టణంలోని వర్తక సంఘం భవనం నందు 32వ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ టోర్నమెంట్ జల్లెల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు ఈ పోటీలలో నేతాజీ కరాటే అకాడమీ కోదాడకు చెందిన కుందూరు రూపక్,గోలి కార్తిక,మామిడి అశ్విక్,గోలి గుణసింహ, అనిపంగు కాంక్ష, కొన్నే ప్రణవ్, మామిడి ధార్మిక విద్యార్థులు కరాటేలో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించి బంగారు,వెండి పతకాలను గెలుపొందారు.ఈ టోర్నమెంట్ కి ముఖ్యఅతిథిగా గ్రాండ్ మాస్టర్,ప్రముఖ సినీ నటుడు సుమన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినిలకు ఆత్మ రక్షణకై కరాటే నేర్చుకుని ఉండాలని, ముఖ్యంగా నేటి మహిళలపై జరుగుతున్న అగత్యాలకు ధీటుగా ఎదుర్కొనేందుకు వారి ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని సూచించారు.కరాటే ద్వారా శారీరక దృఢత్వం మానసిక స్థితి ఏకాగ్రత సాధించటానికి కరాటే ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. తదనంతరం ఆయన నేతాజీ కరాటే అకాడమీ (జే కే ఏ డబ్ల్యూ ఎఫ్) మాస్టర్ కుందూరు సూర్యను మెమెంటుతో సత్కరించి అభినందించారు.

కలిసికట్టుగా ఎల్‌నినో కరువును ఎదుర్కొందాం

మునుగోడుపై జిల్లా యంత్రాం గం ప్రత్యేక దృష్టి సారించాలి

డిండి ఎత్తిపోతల పథకంతోనే కరువుకు శాశ్వత పరిష్కారం

మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





ప్రజా దీవెన, మునుగోడు: అధికా రులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేసి ఎల్ నినో వం టి విపత్కర పరిస్థితులను ఎదు ర్కొని ప్రజలకు అండగా నిలబడా ల్సిన అవసరం ఉందని మునుగో డు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం మునుగో డులోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా యం త్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన అవగాహన సదస్సుకు ఆ యన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మును గోడు శాసనసభ్యులు రాజగోపా ల్ రెడ్డి మాట్లాడుతూ మునుగో డు లాంటి తీవ్ర దుర్భిక్ష పరిస్థి తు లు ఎదుర్కొంటున్న ప్రాంతంలో శాశ్వత సాగునీటి, తాగునీటి సౌ కర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మునుగోడు, దేవర కొండ నియోజకవర్గాల కరువును పారదోలెందుకు డిండి ఎత్తిపోత ల పథకం ఒకటే మార్గమని, అ యితే గత ప్రభుత్వం డిండి ప్రాజె క్ట్ డిజైన్ చేసింది కానీ నీరు ఎక్క డి నుండి తేవాలో ఆలోచించలేద ని, ప్రజా ప్రభుత్వం వచ్చాక సుదీ ర్ఘ చర్చలు జరిపి ఏదుల రిజ ర్వాయర్ ద్వారా నీరు తెచ్చేలా నిధులు మంజూరు చేయించామ ని,డిండి సమస్య సున్నితమైం ది,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులను ఒప్పిం చి నీళ్లు తెచ్చేలా ప్రయత్నం చేస్తా మన్నారు. మన నీటిని మనం పొదుపు చే సుకుంటే చెరువుల ద్వారా సాగ వుతుందని,ఇందుకు 300 కోట్ల రూ పాయాలిస్తే నియోజక వ ర్గం లోని చెరువులన్ని నీటితో నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. తాగు, సాగు నీరు, విద్య,వైద్యం, రోడ్లపై పలుమార్లు తాను సమీ క్ష లు చేసామని, మునుగోడు ని యోజకవర్గంపై జిల్లా యంత్రాం గం ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించాల ని కోరారు. ప్రభుత్వం కరువులో రైతులను ఆదుకోవాలి, దొడ్డు ధా న్యం తేమ శాతాన్ని 17 శాతం నుండి పెంచాలి, మిల్లర్లు సిండికే ట్ గా ఏర్పడి సన్నధాన్యం ధరను తగ్గిస్తున్నారు, ప్రభుత్వం ఒకవేళ కరువు పంట నష్ట పరిహారం ఇస్తే కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. సంప్రదాయ వ్యవ సాయం చేస్తే రైతులు లాభపడటం లేదని, ఆ ర్గానిక్,కమర్శియల్ వ్యవసాయం చేస్తేనే లాభపడతా రని, ఆ దిశ గా,నియోజకవర్గంలో ప్రయత్ని స్తున్నామన్నారు.చెరువులు,కుంటలు,చెక్ డ్యాములు ఎలా నిం పాలో ప్రణాళిక రూపొం దించాల ని,వచ్చే సీజన్ లో వీటిని నింపు కునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. తాగునీ టికి మునుగోడు నియోజక వర్గ నికి ఎక్కువ నిధులు ఇవ్వాల ని, పంచాయతీ కార్యదర్శుల డివ్యు టేషన్ ఆపాలని కోరారు. శాసన మండలి సభ్యులు నెల్లికం టి సత్యం మాట్లాడుతూ మును గోడు నియోజక వర్గంలో 100 కి 80 శాతం పత్తి రైతులున్నారు, కానీ ఎల్ నినో కారణంగా ఎకరా కు 1,, 2 కింటాళ్ళు మాత్రమే వ స్తున్నదని, ఎల్ నినోను జాతీయ విపత్తుగా ప్రకటించాలి, ,పంట న ష్టపోయిన రైతులకు నష్ట పరిహా రం ఇవ్వాలి, విపత్తు లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, రై తాంగాన్ని ఆదుకోవాలి,గ్రామీణ ప్రాంతాలలో నీటి ఎద్దడి నివార ణకు ఆలోచించాలి,అధికారులు అప్రమత్తంగా ఉండి పని చేయా లి,మునుగోడు,దేవరకొండలలో తీవ్ర కరువు పరిస్థితులున్నాయి, సాగు నీటికి అవకాశం లేదు, డిం డి ఎత్తిపోతల పై ప్రత్యేక దృష్టి పె ట్టాలి,ఏదుల పనులు ప్రారంభిం చాలి, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్ళాలని కోరారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మా ట్లాడుతూ ఎల్ నినో దృష్ట్యా అధి కారులు,ప్రజా ప్రతినిధులు ముం దుగా గ్రామాలు,మున్సిపాలిటీ వారిగా నీటివనరులు, అందుబా టులో ఉన్న నీటిని విశ్లేషించా లి,మునుగోడు ప్రాంతంలో భూ గ ర్భజలాలుతక్కువ, అధికారులు భూ ఉపరితలంపై ఉన్న నీటిని మాత్రమే వినియోగించాలి,నీటి నాణ్యత పరిశీలించిన తరువాతే ప్రజలకు నీరు అందించాలి, రైతు లు సమిష్టిగా డిమాండ్ ఉన్న పం టలు పండించేందుకు ముందుకొ స్తే సబ్సిడీ పై పరికరాలు, మార్కె టింగ్,ఇతర సౌకర్యాలు కల్పిస్తా మని తెలిపారు. గట్టుప్ప ల్, ము నుగోడు,చండూరు మండలాల లో వి బి జి రామ్ జి కింద ఉ త్పాదక పనులు చేపట్టాలి,ప్రత్యే కించి జలసిరి పనులు చేపట్టాలి, ఎం పి డి ఓ లు వీటి పై సమీక్షిం చాలన్నారు.అమ్మ ఆదర్శ పాఠశా ల పనుల బిల్లులు జిల్లాలో 7 కో ట్ల రూపాయలు పెండింగులో ఉ న్నాయి, వాటిలో 2 లక్షల వరకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాము. ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా స ర్పంచులు మరిన్నీ పనులు చేప ట్టాలి.వచ్చే జులై వరకు నీటిని ఎలా సంరక్షించి ప్రజాలకందిం చా లో ఆలోచించాలి.ఎల్ నినో విప త్కర పరిస్థితులలో జిల్లా యం త్రాంగం ప్రజలకు, ప్రజాప్రతినిధు లకు అండగా ఉంటుంది. అంద రం కలిసి ప్రజలను ఆదుకుం దా మని అన్నారు.

వ్యవసాయ,అనుబంధ శాఖలు, భూగర్భ,విద్యుత్,పౌర సరఫరా లు,తాగునీటి, మిషన్ భగీరథ గ్రా మీణాభివృద్ధి తదితర శాఖల అ ధికారులు ఎల్ నినో పరిస్థితు ల ను ఎదుర్కోవడం, ప్రత్యామ్నా య పరిస్థితులు,ముందస్తు చర్య లపై సర్పంచులు,ఇతర ప్రజాప్రతి నిధులకు అవగాహన కల్పించా రు.సదస్సు ప్రారంభమైన వెంటనే సదస్సుకు హాజరైన వారందరు “నీటి ని పొదుపు చేద్దాం” నీటిని సంరక్షించుకొందామంటూ “నీటి ప్రతిజ్ఞ “ చేశారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,డి ఆర్ డి ఓ శేఖర్ రె డ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చై ర్మన్, కొందరు సర్పంచులు, తది తరులు మాట్లాడారు. శిక్షణ స హాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,యా దాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, చండూరు ఆర్ డి ఓ శ్రీదేవి, ము న్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, డివి జ న్ ,మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఎల్ నినో పై డి పిఆర్ ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సదస్సులో తమ పాటల ద్వారా చక్కటి అవగాహన కల్పించారు.

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో రహదారి భద్రతా జాగ్రత్తలు పాటించాలి : ఎంవీఐ జిలానీ



ప్రజా దీవెన,కోదాడ : తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు, రహదారులపై నీరు నిలిచే అవకాశం ఉన్న నేపథ్యంలో కోదాడ మరియు హుజూ–ర్‌నగర్ ప్రాంతాల ప్రజలు, వాహన యజమానులు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జిలానీ షేక్ సూచించారు.ఈ సందర్భంగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన అన్ని లారీ అసోసియేషన్లు, రవాణా సంస్థలు, మోటార్ క్యాబ్ యూనియన్లు, ఆటో యూనియన్లు మరియు పాఠశాల బస్సుల యజమానులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు రవాణా రంగానికి మరియు వాహనదారులకు ముఖ్య సూచనలు: లారీ అసోసియేషన్లు, ట్రాన్స్‌పోర్టర్లు భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే సమయంలో అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేయాలిప్రయాణానికి ముందు రహదారి పరిస్థితులను పరిశీలించాలి– వాహనాల్లో సరుకును సురక్షితంగా అమర్చాలి నీటితో నిండిన లేదా ప్రమాదకరమైన రహదారులపై వాహనాలను నడపకూడదు. మోటార్ క్యాబ్ మరియు ఆటో యూనియన్లు:– వాహనాలను తక్కువ వేగంతో, జాగ్రత్తగా నడపాలి.– ఇతర వాహనాలకు తగినంత దూరం పాటించాలి.– దృశ్యమానత తగ్గినప్పుడు హెడ్‌లైట్లు ఉపయోగించాలి.– ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.పాఠశాల బస్సుల యజమానులు:– విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి– బస్సుల బ్రేకులు, టైర్లు, వైపర్లు, లైట్లు తదితరాలను తనిఖీ చేయాలి.వరద నీరు ప్రవహిస్తున్న లేదా ప్రమాదకరంగా ఉన్న రహదారులపై పాఠశాల బస్సులను నడపకూడదు.– పాఠశాలల మూసివేత లేదా రవాణాకు సంబంధించి జిల్లా యంత్రాంగం జారీ చేసే అధికారిక సూచనలను పాటించాలని తెలిపారు.

కామ్రేడ్ అరిగె అంజయ్య చిరస్మరణీయుడు: ఎం. డేవిడ్ కుమార్



శాలిగౌరారం : కామ్రేడ్ అరిగె అంజయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త అని సీపీఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం. డేవిడ్ కుమార్ అన్నారు. శాలిగౌరారం మండలం పెర్క కొండారం గ్రామంలో కామ్రేడ్ అరిగె అంజయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్మించిన స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం అంజయ్య జీవిత సహచరి మ–ుత్తమ్మ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా డేవిడ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పలస భిక్షం స్ఫూర్తితో అంజయ్య సారా వ్యతిరేక ఉ ద్యమం, జీతగాండ్ల సమ్మె, కూలీ రేట్ల పెంపు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాగర్, ఏఐకేఎంఎస్ నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, పీవోడబ్ల్యూ కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర, ఐఎఫ్టీయూ కార్యదర్శి బొమ్మిడి నగేష్, వేముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA

బీసీ కులగణన చేస్తరో, లేదంటే గద్దె దిగుతరో కేంద్రం తేల్చుకోవాలి

బీసీలను మోసం చేస్తున్న అమి త్ షా రాజీనామా చేయాలి

ఓబీసీ కాలం చేర్చకపోతే బిజెపిని బీసీలే ఘోరీ కడతరు

రాష్ట్రానికి ఎవరు వచ్చినా పర్యటనలను అడ్డుకుంటాం



ప్రజా దీవెన, హైదరాబాద్: బీసీ కులగణనన చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన బిజెపి పార్టీని వచ్చే ఎన్నికల్లో బీసీలే రాజకీయంగా ఆ పార్టీని గోరి కట్టడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ బిజెపి ఫైర్ అయ్యారు. సోమవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాదులోని అంబర్ పేటలో లోనీ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా చేపట్టారు. ఈ నిరసన ధర్నాలో జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడుతూ దేశంలోని 80 కోట్ల మంది బీసీల ప్రగాఢ ఆకాంక్ష అయిన బీసీ కులాల లెక్కలు చేపట్టాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే ఎన్నికలలో లబ్ధి పొందడానికి బీసీ కుల గణన చేస్తామని కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించి, తీరా జనగణన చేపడుతున్న ఈ సందర్భంలో ఓబీసీ కాలం చేర్చకుండా బీసీలకు బిజెపి ప్రభుత్వం తీవ్రని అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు బీసీ కులాల లెక్కలు లేకుంటే బీసీలకు భవిష్యత్తు లేదని, బీసీ లు విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో అస్తిత్వం కోల్పోయే ప్ర మాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల కు ఇంత అన్యాయం జరుగుతు న్న బీసీల ఓట్లతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు పార్ల మెంట్ సభ్యునిగా, కేంద్ర మం త్రిగా అయిన జి కిషన్ రెడ్డి కనీ సం స్పందించకపోవడం సిగ్గు చేటు అన్నారు. బీసీలను మోసం చేసిన కేంద్ర మంత్రులకు దేశం లో ఎక్కడ కూడా పర్యటించే అర్హత లేదని, భవిష్యత్తులో బిజెపి జాతీయ నేతలు కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటిస్తే ఖచ్చితంగా అడ్డుకొని తీరుతామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు, బీసీ కులగనన చేపట్టడం చేతకాకపోతే కేంద్ర హోంశాఖ పదవికి అమిత్ షా తక్షణమె రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు బీసీలకు చారిత్రాత్మకంగా ఇంత అన్యాయం చేస్తున్న బిజెపి అధిష్టానం పై బిజెపిలో ఉన్న చీము నెత్తురు ఉన్న బీసీ నేతలు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా లపై తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు బీసీ కాలం చేర్చే వరకు, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు కేంద్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, డిసెంబర్ 14,15 తేదీలలో ఢిల్లీ నీ వేలాది మంది తో ముట్టడించి బీసీల తడాఖా ఎట్లుంటదో బిజెపి ప్రభుత్వానికి రుచి చూపిస్తా మని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీ వ్రంగా హెచ్చరించారు.ఈ ఆందో ళన కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారా యణ,కుందారం గణేష్ చారి, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కుర్మా, పిట్ల శ్రీధర్, ఉప్పరి శేఖర్ సగర, మురళి కృష్ణ, కాటేపల్లి వీరాస్వామి,జాజుల లింగం గౌడ్, గొడుగు మహేష్ యాదవ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, రావులకోల్ నరేష్ ప్రజాపతి, కెవి గౌడ్, కౌల జగన్నాథం, గూడూరు భాస్కర్ మేరు, గోధ వరుణ్ కుమార్ గౌడ్, తారకేశ్వరి, సంధ్యారాణి, గౌతమి, ఇంద్రం రజక, కొప్పుల చందు గౌడ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, సిద్ధాంతం శ్యామల, గుంటి మహేష్, దేవిక, శ్రావణి, అంజమ్మ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు..

రాప్తాడు నిందితుడి కాళ్లు తొలగించే పరిస్థితి

రెండు కాళ్లలోకి దూసుకెళ్లిన ఆరు బుల్లెట్లు

ఒక కాలులో ఇంకా మూడు బు ల్లెట్లు

తీవ్ర రక్తస్రావంతో ఆస్పత్రిలో చికిత్స కాసేపట్లో కీలక ఆపరేషన్



ప్రజా దీవెన, అనంతపురం: రాప్తాడు బాలికపై దాడి కేసులో నిందితుడు హేమంత్ పరిస్థితి వి షమంగా మారినట్లు సమాచా రం. పోలీసుల కాల్పుల్లో రెండు కాళ్ల మోకాళ్ల కింది భాగాల్లోకి ఆ రు బుల్లెట్లు దూసుకెళ్లడంతో అ తడికి తీవ్ర గాయాలయ్యాయి. కుడి కాలులో మరో మూడు బు ల్లెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యులు ఇ ప్పటికే నాలుగు యూనిట్ల రక్తా న్ని ఎక్కించారు.నిందితుడి కాళ్ల కు తీవ్రంగా గాయాలు కావడంతో వాటిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్న ప్రచా రం కలకలం రేపుతోంది. వైద్యు లు కాసేపట్లో శస్త్రచికిత్స నిర్వ హించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆపరేషన్ అనంత రం అతడి ఆరోగ్య పరిస్థితిపై స్ప ష్టత వచ్చే అవకాశం ఉంది.

స్కూల్లో బాలికపై రంపంతో దా డి.. అడవుల్లోకి పరార్

రాప్తాడులోని ఓ పాఠశాలలో బా లికపై రంపంతో దాడి చేసిన హే మంత్ అనంతరం అక్కడి నుంచి పరారై ఆత్మకూరు అటవీ ప్రాం తంలోకి వెళ్లాడు. నిందితుడి ఆ చూకీ గుర్తించిన పోలీసులు అత డిని పట్టుకునేందుకు వెళ్లగా, పో లీసులపై తిరగబడి దాడికి య త్నించినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. మరోవైపు బాధిత బాలికకు చికి త్స కొనసాగుతోంది. తీవ్రంగా గా యపడిన విద్యార్థిని బెంగళూరు లోని మణిపాల్ ఆస్పత్రిలో చికి త్స పొందుతూ కోలుకుంటున్న ట్లు సమాచారం.ఈ ఘటన రా ష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాం శంగా మారింది. నిందితుడి ఆరో గ్య పరిస్థితి, శస్త్రచికిత్స ఫలితా లు, బాలిక ఆరోగ్య పురోగతిపై తదుపరి వివరాల కోసం అంద రూ ఎదురుచూస్తున్నారు. వీరిద్ద రి ఆరోగ్యం విషయంలో హెల్త్ బు లిటిన్ విడుదలయితేనే స్పష్టత వచ్చే అవకాశం లేకపోలేదు.

సకల ఆత్మల పండుగ దివ్య పూజాబలి వేడుకలు



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: సకల ఆత్మల పండుగను పురస్కరించుకొని నల్లగొండ విచారణ కతోలిక కుటుంబాల ఆధ్వర్యంలో దివ్య పూజాబలి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మరణించిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలు శాంతి పొందాలని, భగవంతుని సన్నిధిలో నిత్య విశ్రాంతి పొందాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ మెత్రాసన బిషప్ కరణం ధమన్ కుమార్, విచారణ గురువు గంగారపు బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దివ్య పూజాబలులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు బాలరాజు, జయరాజు, జీవన్ ప్రకాష్, రాయప్ప, కిరణ్, ఆంటోనీ, స్టీఫెన్ తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కతోలిక విశ్వాసులు పాల్గొని మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు.

అధ్యాపకుల బోధన పరిశోధన మెరుగుపడాలి

రిజిస్టర్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: అధునాతన సాంకేతిక పోకడ లను ఆకలింపు చేసుకుంటూ అధ్యాపకులు బోధన మరియు పరిశోధనలో నాణ్యతా ప్రమాణా లు పెరగాలని ఐదు రోజుల శిక్ష ణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో రిజిస్టర్ ఆచార్య కొప్పుల అంజిరె డ్డి అన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్, ఎస్ పి ఓ సి మరియు ఎడ్యునెట్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఇంజనీరింగ్ లోని వివిధ విభాగాల అధ్యాపకులకు పైతాన్, మెషిన్ లెర్నింగ్, ప్రాంప్ట్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధా, సాప్ టెక్ స్కిల్స్ పై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు విభాగ అధిపతి డా జయంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య రేఖ ప్రిన్సిపాల్ డా సుధారాణి ఆచార్య సాంబశివరావు ఎడ్యుటెక్ ప్రతినిధులు సాయి కృష్ణ మరియు విజయ్, ఎం జి యు అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు ఘోర విషాద ఘటనలు

అమెరికాలో 9 మంది, యూపీలో 6మంది సజీవదహనం

ప్రజా దీవెన, హైదరాబాద్: అమెరికా, భారత్‌లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘోర ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. అమె రికాలో ప్రైవేట్ జెట్ కుప్పకూలి తొమ్మిది మంది ప్రాణాలు కోల్పో గా, ఉత్తరప్రదేశ్‌లో ట్రైలర్‌ను ఓ మ్నీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఆ రుగురు దుర్మరణం చెందారు. ఈ రెండు ప్రమాదాలు పలువురి కు టుంబాల్లో తీరని శోకాన్ని మిగి ల్చాయి.

అమెరికాలో కుప్పకూలిన ప్రైవే ట్ జెట్ తొమ్మిది మంది మృతి

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం పామ్ బీచ్ కౌంటీలో ఘోర విమా న ప్రమాదం చోటుచేసుకుంది. టె క్సాస్‌లోని ఆస్టిన్-బెర్గ్‌స్ట్రోమ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బహామాస్‌కు తొమ్మిది మందితో బయలుదేరిన ప్రైవేట్ జెట్ ఒక్కసారిగా ప్రమాదానికి గు రైంది.గగనతలంలో విమానానికి సాంకేతిక సమస్యలు ఎదురవ డంతో పాటు, ప్రతికూల వాతావ రణ పరిస్థితులు ప్రమాదానికి కా రణమైనట్లు ప్రాథమిక సమాచా రం. విమానంపై మంచు పేరుకు పోవడం, వాతావరణంలో తీవ్ర అస్థిరత ఏర్పడటంతో పైలట్ అ త్యవసర పరిస్థితిని ప్రకటించా రు. అయితే, ఎమర్జెన్సీ ప్రకటిం చిన కొద్ది క్షణాల్లోనే విమానం వే గంగా కిందికి దూసుకొచ్చి నేలను బలంగా ఢీకొట్టింది.భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో విమా నం క్షణాల్లోనే అగ్నిగోళంగా మా రిపోయింది. ఈ ప్రమాదంలో పైల ట్ సహా విమానంలో ఉన్న మొ త్తం తొమ్మిది మంది ప్రాణాలు కో ల్పోయినట్లు అమెరికా రవాణా శాఖ కార్యదర్శి సీన్ దఫీ అధి కా రికంగా ధ్రువీకరించినట్లు సమా చారం.

యూపీలో ఘోర రోడ్డు ప్రమా దం.. ఆరుగురి ప్రాణాలు బలి

మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీ నగర్ జిల్లాలో ఆదివారం అర్ధ రా త్రి జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఎనిమిది మందితో ప్రయాణిస్తున్న మారు తి ఓమ్నీ వ్యాన్‌ను భారీ ట్రైలర్ ట్రక్కు బలంగా ఢీకొట్టింది.ఈ ప్ర మాద తీవ్రతకు వ్యాన్ తీవ్రంగా దెబ్బతింది. అందులో ప్రయాణి స్తున్న వారిలో ఆరుగురు తీవ్ర గా యాలు, రక్తస్రావంతో ఘటనాస్థ లంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడారు.

సమాచారం అందుకున్న పోలీసు లు వెంటనే ఘటనా స్థలానికి చే రుకుని సహాయక చర్యలు చేప ట్టారు. క్షతగాత్రులను అత్యవస ర చికిత్స నిమిత్తం గోరఖ్‌పూర్ లోని బీఆర్‌డీ మెడికల్ కాలేజీకి తరలించారు.రెండు ప్రాంతాల్లో రెండు ఘోర ప్రమాదాలు, మొ త్తం 15 మంది మృత్యువాత ప డటంతో బాధిత కుటుంబాల్లో వి షాద ఛాయలు అలముకున్నా యి.

దళితబంధు వెంటనే విడుదల చేయాలి

ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: గత ప్రభుత్వ హయాంలో దళిత బం ధు పథకానికి అర్హత సాధించి, ప్రొసీడింగ్ చెక్కులు పొందినప్ప టికీ నేటికీ ఆర్థిక సాయం అందని బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రా ష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. గ్రీవెన్స్ డే సం దర్భంగా నల్గొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించా రు.ఈ సందర్భంగా కట్టెల శివకు మార్ మాట్లాడుతూ.. 2023లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా దళిత బంధు పథకాన్ని అమలు చేసిందన్నారు. స్వయం ఉపాధి, చిరు వ్యాపారాల ద్వారా దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉ ద్దేశంతో ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ ఆధ్వర్యంలో నల్గొండ నియోజకవర్గానికి చెందిన వెయ్యి మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ చెక్కులు సైతం జారీ చేశారని, ఇందుకు సంబంధించిన సుమారు రూ. 30 కోట్ల నిధులు కలెక్టర్ ఖాతాలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ 50 నుంచి 100 మంది వరకు లబ్ధిదారులకు ప్రొసీడింగ్ చెక్కులు అందించినప్పటికీ, వారికి పూర్తి స్థాయిలో దళిత బంధు సాయం అందలేదని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలను ఏళ్ల తరబడి నిరీక్షణలో ఉంచడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధుల మేరకు ఎస్‌డీఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ తదితర మార్గాల ద్వారా అర్హులకు రావాల్సిన ఆర్థిక సాయాన్ని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కలెక్టర్ ద్వారా కోరారు. నల్గొండ నియోజకవర్గంలోని వెయ్యి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బండారు శంకర్, సలహాదారులు కందుల విజయ్ కుమార్, జానీమియా, జిల్లా కన్వీనర్ ఈగల సూర్య, సురేందర్ నాయక్, గంట సుమంత్, పేర్ల మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాల్మన్ రాజ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి తిన్నారా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జాతీయ రహదారి రక్తపుటేరులు

ఘోర రోడ్డుప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ప్రజా దీవెన, కట్టంగూరు: జాతీ య రహదారి NH-65పై మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది. కట్టంగూరు మండలం అ యిటిపాముల గ్రామ శివారులోని చెరువు అన్నారం ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదం ఇద్దరి ప్రాణాల ను బలిగొంది. మరో వ్యక్తి తీవ్ర గా యాలతో ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ, హైవేపైకి వ స్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్ర మాద తీవ్రతకు ద్విచక్ర వాహనం పై ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యా యి. సమాచారం అందుకున్న పోలీసు లు వెంటనే ఘటనా స్థలానికి చే రుకుని సహాయక చర్యలు చేప ట్టారు. క్షతగాత్రుడిని చికిత్స ని మిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీ సులు ప్రమాదానికి గల కా రణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలముకున్నా యి.హైవేపై వాహ నదారులు అ ప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని పోలీసు లు సూచిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పదవి విరమణ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చారు

అధికారంలో ఉన్నప్పుడు ఉద్యో గుల సమస్యలు గుర్తుకు రాలేదా

బిఆర్ఎస్ దేవి ప్రసాద్ రావు వ్యాఖ్యలు సరికాదు

టీఎన్జీవో మాజీ జిల్లా అధ్య క్షుడు ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి ఘాటు విమర్శలు



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: భూగర్భ జలవనరుల శాఖ సూపరిండెంట్, టీఎన్జీవో తాలూకా నాయకులు ఆకునూరి లక్ష్మయ్య పదవి విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను టీఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు ఏడు దొడ్ల వెంకట్రామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఉద్యోగి పదవి విరమణ కార్యక్రమానికి హాజరై రాజకీయాలు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగి జీవితంలో ఎంతో ముఖ్యమైన పదవి విరమణ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న దేవి ప్రసాద్ రావు,కంచర్ల భూపాల్ రెడ్డిలు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి ఏం చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పదేళ్లు పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని అప్పట్లో వాటి పరిష్కారం కోసం ఎందుకు చొరవ తీసుకోలేదని నిలదీశారు. ఉద్యోగుల సమస్యలపై నిజంగా వారికి చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న సమయంలోనే వాటి పరిష్కారానికి కృషి చేసి ఉండాల్సిందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి విమర్శించారు. ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ఉందని భావిస్తున్న నాయకులు ముందుగా తమ గత పాలల్లో చేసిన పనులను ఒకసారి ఆత్మ విమర్శన చేసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతినెల వేతనాలు 1వ తారీకు చెల్లించాల్సి ఉండగా 10 నుంచి 20 తారీకు మధ్య చెల్లించేవారని అన్నారు. దీంతో వారు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. గతంలో మూడు డిఏలు, ఉద్యోగుల జిపిఎఫ్, టీఎస్ జిఎల్ ఐఎఫ్ డబ్బులు, సరెండర్ లీవ్ రాకున్నా ఏ రోజు కూడా వీరు అప్పటి ప్రభుత్వాన్ని అడిగిన దాఖలాలు లేవన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఉద్యోగ సంఘ నాయకులకు అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై కాంగ్రెస్ వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసిందని, 180 మందిని సస్పెండ్ చేశారని అసత్య ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దేవి ప్రసాద్ రావుతో కలిసి ఎన్నో కార్యక్రమంలో పాల్గొన్నామని, ఉద్యోగుల సమస్యలు ఏంటో ఆయనకు పూర్తిగా తెలుసన్నారు. అయినప్పటికీ ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం తగదు అన్నారు. 2014 ముందు తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీఎస్ నాయకుల పాత్ర ఎంతో కీలకమని, వారి సహకారంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. 2014 తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం సంగం బలంగా ఉన్నదని వారు తలచుకుంటే ఏదైనా సాధిస్తారని గ్రహించి సంఘంలో కొంతమందిని తమ రాజకీయ ప్రలోభాల కోసం వాడుకున్నారని తెలిపారు. అప్పటినుంచి టీఎన్జీవో సంఘంలో చిచ్చుపెట్టి సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించి జోనల్ విధానంతో భార్యాభర్తలను వేరువేరు ప్రాంతాలకు బదిలీ చేసిందన్నారు. నూతనంగా ఎవరిని రిక్రూట్మెంట్ చేయలేదన్నారు. దీంతో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి మానసిక ఇబ్బందులకు గురియ్యారని ఆవేదన వ్యక్తం చేశారు జీవో నెంబర్ 317 190 వీటి ప్రకారం భార్యాభర్తలను వివిధ జిల్లాలకు బదిలీ చేసి ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. ఈ సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదు అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్న విషయాలను గుర్తించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ఉద్యోగుల పదవి విరమణ కార్యక్రమాలను రాజకీయాల కొత్తగా నిర్వహించాలని ఇలాంటి కార్యక్రమాలు వ్యక్తిగత రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ఉద్యోగుల గౌరవాన్ని కాపాడాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులను పిలిపించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మాజీ సహా అధ్యక్షుడు మామిడాల రమేష్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన

బాధితులకు చట్ట పరంగా న్యాయం చేయాలి

నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాల యంలో సోమవారం నిర్వహిం చిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్ర మంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 34 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ గారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

ఎల్ నినో దృష్ట్యా విద్యుత్తును పొదుపు చేయండి

చిన్న చిన్న చిట్కాల ద్వారా విద్యుత్తు వృధాను అరికట్టండి

విద్యుత్ ఆదాపై విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి .చం ద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ: ఎల్ నినో పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు విద్యుత్తును ఆదా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా రెడ్ కో ఆధ్వర్యంలో "సేవ్ ఎనర్జీ" పేరున ఈనెల 1 నుండి 7 వరకు వారం రోజులపాటు నిర్వహించనున్న" సేవ్ ఎనర్జీ" కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న చర్యలను జిల్లా కలెక్టర్ వివరించారు. " సేవ్ ఎనర్జీ" కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు, ప్రజలు అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా చిన్న చిన్న చిట్కాల ద్వారా విద్యుత్ ను ఎలా ఆదా చేసుకోవాలో చెప్పాలని, సోలార్ ఎనర్జీని వాడడం, ఈ- వేస్టేజ్ తదితర అంశాలపై జిల్లా అధికారులకు వివరించారు. జిల్లా , మండల, గ్రామస్థాయి వరకు అధికారులు,సిబ్బంది ఇకపై ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుండి 11:30 వరకు అన్ని కార్యాలయాలలో సూర్యరశ్మి ఎక్కువగా ఉన్నచోట లైట్లు ,ఫ్యాన్లు వేసుకోవద్దని, ఎయిర్ కండిషన్ ను 25 డిగ్రీలకు మించి పెట్టుకోకూడదని, విద్యుత్ ఆదా పద్ధతులను కింది స్థాయి వరకు తెలియజేయాలని, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులను ఒకచోట సమావేశపరిచి విద్యుత్ ను ఎలా ఆదా చేయాలనే దానిపై చిన్న చిన్న చిట్కాలను తెలియజేయాలని చెప్పారు. అవసరమైతే పిల్లల వర్క్ డైరీలో వీటన్నిటిని నమోదు చేయాలని, తద్వారా తల్లిదండ్రులు అదే పాటిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, జన సమ్మర్థం ఎక్కువగా ఉన్నచోట విద్యుత్తు పొదుపుపై ప్లెక్సీలు, స్టాండీలు ఏర్పాటు చేయాలని చెప్పారు .. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులచేత "విద్యుత్తును పొదుపు చేస్తానని" ప్రతిజ్ఞ చేయించారు. నవంబర్ 1 నుండి 15 వరకు బిర్సా ముండ 151 వ జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, జన జాతీయ గౌరవ దివస్ ఉత్సవాల పేరిట 15 వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు .ముఖ్యంగా గిరిజనులకు సంబంధించిన పథకాలు, చరిత్ర, చిత్రలేఖన, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ,వర్క్ షాప్ ల నిర్వహణ, ఎగ్జిబిషన్లు, క్విజ్ కాంపిటీషన్స్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షిస్తూ 30 రోజులకు మించి పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులన్నీ ఈ వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో 391, మండల స్థాయిలో 359 ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని, ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ప్రజావాణిపై ఈ నెల మధ్యలో ప్రత్యేకంగా సమీక్షించనున్నట్లు వెల్లడించారు. అర్ణబ్ తుఫాన్ వల్ల జిల్లాలో కొన్ని ప్రాంతంలో వర్షం కురిసిందని, అలాగే రానున్న మాతో తుఫాను వల్ల మూడు, నాలుగు రోజుల్లో కురిసే వర్షపు నీటిని తప్పనిసరిగా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ఈ వారం మొత్తం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో సోక్ పిట్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీ- సర్వేలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారికి సంబంధించిన ఆస్తులను తప్పనిసరిగా ఎన్యుమరేషన్ చేయించుకోని ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. పెన్షన్ పొందే పెన్షన్ దారుడు చనిపోతే వెంటనే భార్య కు పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు సంబంధించి ఎవరైనా అర్హులు ఉంటే డిఆర్డిఓ తో సంప్రదించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జనజాతీ య గౌరవ దివస్ సెలబ్రేషన్స్ పై రూపొందించిన గోడపత్రికను జి ల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్ర మంలో డిటిడిఓ కమలా కర్ రెడ్డి ,రెడ్కో ప్రతినిధి అశోక్, తదితరులు హాజరయ్యారు.

AIKS జాతీయ మహాసభల ప్రచారంలో సరికొత్త ముందడుగు

మట్టి పరిమళాలురైతాంగపోరు గీతాలు' వీడియో పాటల ఆవి ష్కరణ

ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: అఖిల భారత కిసాన్ సభ (AIKS) 36వ జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా ప్రజానాట్యమండలి (PNM), ు10 మల్టీచానల్ నెట్వర్క్ సంయుక్తంగా రూపొందించిన 'మట్టి పరిమళాలు – రైతాంగ పోరు గీతాలు' వీడియో పాటలను మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సోమవారం నల్గొండ పట్టణంలో ఆవిష్కరించారు. రైతాంగ ఉద్యమ చరిత్ర, వ్యవసాయ రంగ సంక్షోభం, రైతుల జీవన పోరాటాలు, హక్కుల సాధన కోసం సాగుతున్న ఉద్యమాలు, కనీస మద్దతు ధర (MSP) సహా రైతాంగ ప్రధాన డిమాండ్లను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక వీడియో సాంగ్స్ను రూపొందించారు. కళ, సాహిత్యం, సంగీతం, ఆధునిక దృశ్య మాధ్యమాలను సమన్వయం చేస్తూ రైతాంగ ఉద్యమ సందేశాన్ని విస్తృత ప్రజానీకానికి చేరవేసే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, రైతుల బతుకులు, వారి సమస్యలు, హక్కుల కోసం సాగుతున్న పోరాటాలను ప్రజలకు చేరవేయడంలో పాటలు అత్యంత శక్తివంతమైన మాధ్యమాలని పేర్కొన్నారు. ఉద్యమాలు కేవలం సభలు, సమావేశాలకే పరిమితం కాకుండా కళలు, సాహిత్యం, సంగీతం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని అన్నారు. ూ×ఖూ జాతీయ మహాసభల ప్రచారంలో 'మట్టి పరిమళాలు' వీడియో పాటలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు సాక్షిగా నిలిచిన నల్గొండ గడ్డపై దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగ నాయకులు, ప్రతినిధులు ఒకచోట చేరడం చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన విషయమని ఆయన అన్నారు. జాతీయ మహాసభలకు సంబంధించిన



విశేషాలు, రైతాంగ నేతల సందేశాలు, చర్చలు, తీర్మానాలు దేశవ్యాప్తంగా ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా బృందాలు కీలక బాధ్యత పోషించాలని పిలుపునిచ్చారు.

రైతాంగ హక్కుల సాధనకు డిజిటల్ మాధ్యమాలు తోడ్పడాలి: టి. సాగర్

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ, రైతాంగ పోరాటాల స్ఫూర్తిని ప్రతిబింబించేలా పాటలను రూపొందించిన ప్రజానాట్యమండలి బృందానికి, వాటిని ఆధునిక సాంకేతికతతో వీడియో రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తున్న T10 బృందానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం, పంటలకు గిట్టుబాటు ధరలు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ వంటి కీలక హక్కుల సాధన కోసం రైతాంగ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. AIKS 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయడంలో సంప్రదాయ మీడియాతో పాటు సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు విస్తృతంగా భాగస్వాములు కావాలని కోరారు. రైతాంగ సమస్యలను గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు చర్చలోకి తీసుకురా వడంలో డిజిటల్ వేదికలు కీలకంగా నిలవాలని అన్నారు.

ఆధునిక సాంకేతికతతో రైతాంగ ఉద్యమానికి కొత్త ప్రచార రూపం: బండారు రవికుమార్

తెలంగాణ సోషల్ మీడియా రాష్ట్ర ఇన్చార్జి బండారు రవికుమార్ మాట్లాడుతూ, మల్టీ కెమెరా చిత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నిర్మాణ విలువలతో రైతాంగ పోరు గీతాలను వీడియో రూపంలో రూపొందించడం అభినందనీయమైన ప్రయోగమని అన్నారు. ప్రజా ఉద్యమాల సందేశాన్ని కొత్త తరానికి చేరవేయడానికి సంప్రదాయ ప్రచార పద్ధతులతో పాటు ఆధునిక డిజిటల్ సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయ సంక్షోభం, ప్రజా పోరాటాల చరిత్రను యువతకు చేరువ చేయడంలో ఇలాంటి సృజనాత్మక ప్రయత్నాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 'మట్టి పరిమళాలు' వీడియో పాటలను సోషల్ మీడియా వేదికల ద్వారా లక్షలాది మందికి చేరవేయాలని, ప్రతి ఒక్కరూ ఈ పాటలను విస్తృతంగా షేర్ చేసి AIKS జాతీయ మహాసభల ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైతాంగ పోరాట స్ఫూర్తిని డిజిటల్ వేదికలపైకి : ఎండి అబ్బాస్

రైతాంగ ఉద్యమ చరిత్రను, వీరోచిత పోరాటాలను, నేటి వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను డిజిటల్ వేధిక ద్వారా ద్వారా ప్రజలకు చేరవేయడం చాలా అవసరం అని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. AIKS 36వ జాతీయ మహాసభల సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయడమే 'మట్టి పరిమళాలు' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సాంస్కృతిక ఉద్యమానికి ఆధునిక డిజిటల్ సాంకేతికతను జోడిస్తూ రూపొందించిన ఈ వీడియో పాటలు రైతాంగ సమస్యలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు యువతను రైతాంగ ఉద్యమ భావజాలానికి చేరువ చేస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

PNM--T10 సంయుక్త కృషితో 'మట్టి పరిమళాలు'

ఈ కార్యక్రమానికి T10 CEO సుందర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి (PNM) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జె. వినోద్, కట్టా నర్సింహ ఈ పాటల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. సంగీత దర్శకుడు ఐలు నేతృత్వంలో గీతాలకు సంగీతం సమకూర్చగా, ప్రజానాట్యమండలి కళాకారులు, రచయితలు, గాయకులు తమ సృజనాత్మక భాగస్వామ్యాన్ని అందించారు. T10 బృందం ఆధునిక చిత్రీకరణ, వీడియో నిర్మాణం, సాంకేతిక రూపకల్పన బాధ్యతలను చేపట్టింది. ఈ కార్యక్రమంలో AIKS జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం బాధ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వి వెంకటేశ్వర్లు, భూపాల్, శ్రీరామ్ నాయక్, ఆశయ్య, వెంకటేష్, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డి మల్లేశం, ప్రమీళ, పాలడుగు నాగార్జున, సయ్యద్ ఆశం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మి నారాయణ, ఐత విజయ్, అనగంటి వెంకటేష్, కోట రమేష్, టి నాగరాజు, రజినీ కాంత్, మమత, పుచ్చకాయల నర్సిరెడ్డి, కె శంకర్, డి. రామకృష్ణ, ఆదేష్, సలీం, సత్తయ్య, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకుల ఆధిపత్యానికి చరమ గీతం పాడాలి

బీసీలకు రాజ్యాధికారం సాధిం చాలి

నల్లగొండలో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు

2028లో బీసీలను అధికా రంలోకి తీసుకొస్తాం

కత్తెర గుర్తుతో దోపిడీదారుల తోకలు కత్తిరిస్తాం

వరంగల్--నల్లగొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పాలకూరి అశోక్ కుమార్ గౌడ్ ప్రకటన





ప్రజా దీవెన, నల్లగొండ: తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీగా ఉ న్న బీసీలకు రాజకీయ అధికారం లో తగిన ప్రాధాన్యత కల్పించా ల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ ఆర్పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల హక్కులను విస్మరిస్తూ, వారి ఆర్థిక, రాజకీయ అవకాశాలకు గండికొడుతున్నారని ఆరోపిస్తూ అగ్రకుల ఆధిపత్య రాజకీయాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన బీసీ రాజ్యా ధికార పాదయాత్ర సోమవారం నల్లగొండకు చేరు కుంది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మల్లన్న మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకునే కోమటిరెడ్డి బీసీల అభ్యున్నతికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది జనరల్ స్థానాల్లో ఎనిమిది స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించారని ఆరోపించారు. 1985లోనే అప్పటి ఎన్టీఆర్ ప్రభుత్వం బీసీలకు 45 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 166 తీసుకొచ్చిందని, అయితే అగ్రవర్ణ నాయకులు కోర్టులను ఆశ్రయించి ఆ నిర్ణయాన్ని అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఏటా రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు రూ. 2,400 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు శాసనమండలిలో తాను అడిగిన ప్రశ్నకు సమాధా నంగా వెల్లడించిందని మల్లన్న తెలిపారు. గత బీఆర్ఎ స్ ప్రభుత్వ హయాంలో తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి జైళ్లలో పెట్టి వేధించారని ఆరోపించారు.

కత్తెర గుర్తుతో రాజకీయ పోరాటం

తెలంగాణ రాజ్యాధికార పార్టీకి కత్తెర గుర్తు కేటాయించారని ప్రకటించిన మల్లన్న, బీసీ వృత్తిదారుల చేతుల్లో ఉండే కత్తెరతో అగ్రవర్ణ దోపిడీ రాజకీయాలకు ముగింపు పలుకుతామని వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా పాలకూరి అశోక్ కుమార్ గౌడ్

వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున పాలకూరి అశోక్ కుమార్ గౌడ్ పోటీ చేస్తారని తీన్మార్ మల్లన్న అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ కుమార్ గౌడ్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

2028లో బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

పాదయాత్రలో భాగంగా సోమవారం తిప్పర్తికి చేరుకున్న తీన్మార్ మల్లన్న అక్కడ మాట్లాడుతూ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలను అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ప్రకటించారు. బీసీ నాయకులను అగ్రవర్ణాల వారు బెదిరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు, అంజదుల్లా ఖాన్, ప్రొఫెసర్లు మురళీ మనోహర్, శేషు, నారగోని ప్రవీణ్, దేవళ్ల సమ్మయ్య, సతీష్ కొట్టే, ఎర్ర సత్యనారాయణ, లింగాల గంగాధర్, మదన్మోహన్ చారి, ఎల్లబోయిన ఓదెలు యాదవ్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, సోషల్ మీడియా కన్వీనర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.







నేడు డీఎస్సీ నోటిఫికేషన్

జనరల్, క్రీడా పోస్టులు కూడా.. క్రీడల కోటాలోనూ

రాత పరీక్ష.. 2,721 పోస్టుల భర్తీకి చర్యలు

అమరావతి : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇప్పటికే షార్ట్ నోటిఫికేషన్ విడుదల చేయగా దీనికి సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ ఇప్పుడు విడుదల చేస్తారు. ఇప్పటికే ప్రకటించిన 2,721 పోస్టు లతో ఈ నోటిఫికేషన్ రానుంది. విద్యారతలు, సిలబస్ వివరా లను ఈ నోటిఫికేషన్లో పేర్కొంటారు. మెగా డిఎ స్సీ లో క్రీడా కోటాకు శాప్ విడిగా నోటిఫికేషన్ జారీ చేయ నుంది. కానీ, ఈ డీఎస్సీలో క్రీడా పోస్టులను కూడా జనరల్ పోస్టులతో కలిపి భర్తీ చేయనున్నారు. అలాగే, క్రీడా కోటా అభ్యర్థులకు కూడా రాత పరీక్ష నిర్వహిస్తారు. గత డీఎస్సీ తరహాలోనే హారిజంటల్ రిజర్వేషన్ విధానం అమలు చేస్తారు. మొత్తం పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ జనరల్ 931, స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్) 255, ఎస్జీటీ జన రల్ 1231, ఎస్జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్) 304 పోస్టులు. ఉ న్నాయి. వీటిలోనే వయోజన విద్యలో 4, గ్రంథాలయాల్లో 100, డైట్, ఎస్సీఈఆర్టీలో 174 పోస్టులు కూడా ఉంటాయి.

చారిత్రక వైభవానికి సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్

ఎంజియు ఉపకులపతి

ఆచా ర్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: దక్షిణ భారత చరిత్ర, సామాజిక విశ్లేషణలకు 45వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ వేదిక కానుందని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎం జి యు లో నిర్వహించిన పత్రిక ప్రెస్ మీట్‌లో ఉప కులపతి మాట్లాడుతూ నవంబర్ 13 14 15 తేదీలలో జరగనున్న సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ద్వారా చారిత్రక అంశాలపై చర్చలు మరియు పరిశోధనలపై విద్యార్థులు యూనివర్సిటీ మరియు డిగ్రీ కళాశాల అధ్యాపకుల్లో జిజ్ఞాసతో పాటు ప్రభుత్వ అంగాలకు ఈ సెమినార్ విలువైన సమాచారాన్ని జ్ఞానాన్ని అందించనుందన్నారు. దక్షిణ భారత చారిత్రక వైభవ ప్రదర్శనకు , నల్లగొండ జిల్లా పర్యాటక ప్రాచుర్యానికి ఈ మూడు రోజుల జాతీయ స్థాయి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ సెమినార్ ద్వారా దక్షిణ భారత సామాజిక ఆర్థిక సాంస్కృతిక మరియు రాజకీయ చరిత్ర పై, అణగారిన ప్రజల చరిత్రలు ఇస్థిరోగ్రఫీ మరియు డిజిటల్ ఆన్లైన్ ప్రదర్శనలపై లోతైన విశ్లేషణతో కూడిన పరిశోధనలను సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న కార్యక్రమం పూర్తి వివరాలను మీడియాతో పంచుకున్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ నిర్వహణ ఎంజియూకు మరియు జిల్లాకు గర్వకారణమని ఆయన అన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ డా అరుణప్రియ, ఆచార్య విజయబాబు లతో సెమినార్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగ అధ్యాపకులు డా.పనస రామకృష్ణ, డా షరీఫ్, వివేక్ పాల్గొన్నారు.

మురసు అలర్

ఎగసిపడుతున్న అలలు

ముందుకొచ్చిన సంద్రం.. పెను గాలులు

దక్షిణ కోస్తా తీరంలో హై అలెర్ట్

ఒంగోలు సమీపానికి తీవ్ర తుఫాన్

అర్ధరాత్రి తర్వాత తీరం దాటే ప్రక్రియ మొదలు

ఆ సమయంలో 125 కి.మీ. వేగంతో పెనుగాలులు

బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు

రాయలసీమలోనూ దట్టంగా ముసురు.. జల్లులు

నిజాంపట్నంలో 10, బందరులో 9, కృష్ణపట్నంలో ఎనిమిదో నంబరు తుఫాన్ హెచ్చరిక జారీ

రోజంతా ఆర్టీజీఎస్‌లోనే గడిపిన ముఖ్యమంత్రి

దఫదఫాలుగా అధికారులు, కలెక్టర్లతో సమీక్షలు

ప్రభావిత జిల్లాల్లో నేడు పాఠశాలలకు సెలవు

గన్నవరం, భోగాపురంలో విమాన సర్వీసులు రద్దు

అమరావతి : మరో తుఫాను కల్లోలం రేపుతోంది. 'మురసు' ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. తీరాల్లో పెనుగాలులు హోరెత్తుతున్నాయి. దీంతో దక్షిణ కోస్తా తీరంలో హై అలెర్ట్ ప్రకటించారు. సోమవారం సాయంత్రానికి ఒంగోలుకు చేరువగా తీవ్ర తుఫాన్ వచ్చింది. ఒంగోలుకు దక్షిణ భాగంలో తుఫాన్ తీరం దాటే ప్రక్రియ మొదలై మంగళవారం తెల్లవారుజాము కల్లా పూర్తయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల తీర ప్రాంతాల్లో గంటకు 100 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయనున్నాయి. ఆ సమయంలో అంతెత్తున రాకాసి అలలు ఎగసిపడనున్నాయి. తుఫాను ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ముసురు పట్టింది. మధ్యాహ్నం నుంచి చిరు జల్లులు మొదలయ్యాయి. ఈదురుగాలులు పెరిగాయి. దీంతో ప్రభావిత జిల్లాల కలెక్టర్లతోపాటు మొత్తం అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సీఎం చంద్రబాబు రోజంతా 'తుఫాను' గతి విధులపై దఫదఫాలుగా సమీక్షలు జరిపారు ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది దాకా సిద్ధం చేశారు. తుఫాను నిర్వహణ, వరద నీటి సమర్థ వినియోగం, సహాయక చర్యలపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలోనే ఆయన గడిపారు. రాబోయే 48 గంటల్లో చోటుచేసుకునే పరిణామాలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు.

ముందుకొచ్చిన సముద్రం

బాపట్ల నుంచి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు వరకు తుఫాను ప్రభావంతో అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీనివల్ల పలు జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై కనిపించడం మొదలైంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. మధ్యాహ్నం తర్వాత ఈదురు గాలుల ప్రభావం కూడా పెరిగింది. సముద్రం అల్లకల్లోలంగా మారి, అలలు ఎగసి పడుతున్నాయి. కృష్ణపట్నం పోర్టులో 8వ నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సెలవులు రద్దు చేశారు. ఇక.. బాపట్ల జిల్లాకు వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. నిజాంపట్నం హార్బర్‌లో పదో నంబరు ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. నిజాంపట్నంతోపాటు సూర్యలంక, రామాపురం, వాడరేవు తీరాల్లోని బోట్లను ఇప్పటికే ఒడ్డుకు చేర్చడంతో పాటు మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. మురసు ప్రభావంతో సూర్యలంక తీరంలో నీళ్లు ముందుకు చొచ్చుకొచ్చాయి. అక్కడ ఉన్న పోలీస్ అవుట్‌పోస్టును అలలు తాకాయి. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. కాగా, మచిలీపట్నంలో తొమ్మిదో నంబరు, మిగిలిన ప్రధాన రేవుల్లో మూడో నంబరు హెచ్చరిక ఎగురవేశారు.

తీరంలో టెన్షన్..

బాపట్ల జిల్లా చీరాల మండలం ఓడరేవు గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తున్న వస్తుండగా వారి బోటు ఇంజన్ ఫెయిల్ అవడంతో సముద్రంలో చిక్కుకుపోయింది. ఈ బోటును బోగోలు మండలం (నెల్లూరు జిల్లా) జువ్వలదిన్నె హార్బర్ అధికారులు గుర్తించారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి చిక్కుకున్న బోటుతోపాటు అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా, సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు తిరుగు ప్రయాణంలో ఇంజన్ గేర్ బాక్స్ మరమ్మతుకు గురవ్వడంతో రుషికొండ తీరానికి కొట్టుకు వచ్చింది. వాడచీపురుపల్లికి చెందిన నరసింగరావు, ఆరుగురితో కలిసి అక్టోబరు 30న చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకొని సోమవారం రాత్రి తిరిగి వస్తుండగా రుషికొండ దగ్గరలో ఇంజన్‌లో గేర్ బాక్స్ పాడైపోయింది. లంగరు వేయడానికి యత్నించగా, బోటు తీరం వైపు కొట్టుకువచ్చింది. సోమవారం తెల్లవారుజాము వరకు అందులో ఉండి ఉదయాన్నే ఆరుగురూ ఏపీ మరపడవల సంఘానికి, అధికారులకు సమాచారం ఇచ్చారు. మత్స్యకార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీ, సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు, సెక్రటరీ బాలాజీ కలిసి వెళ్లి బోటును పరిశీలించారు. అలల తాకిడికి బోటు హల్ పాడైపోయి బాగా నష్టం జరిగిందని, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

ఆందోళనలో రైతులు..

మురసు తుఫాను హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈసారి కూడా వరి ముంపు బారిన పడితే తాము కోలుకోవడం కష్టమని వాపోతున్నారు. మురసు తుఫాను ప్రకాశం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులు మొదలయ్యాయి. మత్స్యకారులను సముద్రంలో వేటకు వెళ్లకుండా యంత్రాంగం నిలిపివేశారు. జిల్లాకు చెందిన మంత్రి స్వామి తీరప్రాంతంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. స్పెషల్ ఆఫీసర్ రంజిత్‌బాష సోమవారం రాత్రి ఒంగోలు చేరుకుని కలెక్టర్ ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరోవైపు, శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడ్డారు. తిరుమలలో వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో ఘాట్‌రోడ్లలో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నా రు. అన్నప్రసాద పంపిణీకి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.

విమాన సర్వీసులు రద్దు

తుఫాను కారణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మంగళవారం వెళ్లాల్సిన పలు విమానాల ను రద్దు చేసినట్లు విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లైట్ 91, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఎయిరిండియా విమానాలను రద్దు చేసినట్లు ప్రకటించారు. కాగా, తుఫాన్ కారణంగా గాలులతో కూడిన వర్షం పడడంతో సోమవారం ఉదయం భోగాపురం నుంచి బయలుదేరాల్సిన విమాన సర్వీసులు రద్దయ్యాయి.

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్

భారత-ఏ కెప్టెన్‌గా తిలక్ వర్మ..

జట్టులో హేమాహేమీలకు చోటు!

ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు భారత-ఏ జట్టు ప్రకటన

కెప్టెన్‌గా తిలక్ వర్మ, వైస్ కెప్టెన్‌గా రజత్ పటిదార్‌కు బాధ్యతలు

రింకూ సింగ్, అభిషేక్ శర్మ, షాబాజ్ అహ్మద్‌లకు జట్టులో చోటు

నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహాలో టోర్నమెంట్

గ్రూప్ దశలో నవంబర్ 22న పాకిస్థాన్‌తో తలపడనున్న భారత్



ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నిర్వహించనున్న పురుషుల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం భారత-ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మకు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించగా, ఐపీఎల్‌లో రెండుసార్లు టైటిల్ గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించిన రజత్ పటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నమెంట్ నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహా వేదికగా జరగనుంది. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కీలక ఆటగాళ్లకు చోటు దక్కింది. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్ర ఎంపికయ్యారు. వారితో పాటు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, ప్రిన్స్ యాదవ్, సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, హర్ష్ దూబే వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. గాయం కారణంగా కొంతకాలంగా ఆటకు దూరమైన సీమ్ బౌలింగ్ ఆల్-రౌండర్ హర్షిత్ రాణా పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి పునరాగమనం చేశాడు. తనుష్ కోటియన్, విప్రాజ్ నిగమ్, అర్షద్ ఖాన్‌లతో జట్టు కూర్పు సమతూకంగా కనిపిస్తోంది. గత ఏడాది దోహాలో జరిగిన టోర్నీలో పాల్గొన్న భారత-ఏ జట్టుతో పోలిస్తే ఈసారి సెలక్టర్లు భారీ మార్పులు చేశారు. గత జట్టు నుంచి కేవలం వైభవ్ సూర్యవంశీ, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే మాత్రమే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గత కెప్టెన్ జితేష్ శర్మ, వైస్ కెప్టెన్ నమన్ ధిర్‌లతో పాటు పలువురు ఆటగాళ్లను వివిధ కారణాలతో ఎంపిక చేయలేదు. ఈ టోర్నమెంట్‌లో భారత-ఏ జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇదే గ్రూప్‌లో యూఏఈ, నేపాల్, పాకిస్థాన్-ఏ జట్లు ఉన్నాయి. గ్రూప్-ఏలో బంగ్లాదేశ్-ఏ, శ్రీలంక-ఏ, ఆఫ్ఘనిస్థాన్-ఏ, హాంకాంగ్ ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది. అనంతరం నవంబర్ 22న పాకిస్థాన్-ఏ జట్టుతో, నవంబర్ 24న యూఏఈతో తలపడనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 26, 27 తేదీల్లో సెమీఫైనల్స్, నవంబర్ 29న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

భారత-ఏ జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్.

దిగ్గజ జట్లకు షాక్.. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది.

అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు.

ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

టీమిండియా కోచ్‌గా మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నా..

గంభీర్ కీలక వ్యాఖ్యలు




టీమిండియా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వహించడం అంత సులభం కాదు. ప్రతి మ్యాచ్‌లో గెలవాలనే అంచనాలు.. ఆటగాళ్ల ఎంపికలో సవాళ్లు.. వరుస పర్యటనలు.. ఇలా నిరంతరం ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో తాను కూడా కొన్నిసార్లు మానసికంగా అలసిపోతున్నానని భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరించాడు. అయితే ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు. న్యూజిలాండ్‌తో ఐదో టీ20 ముగిసిన అనంతరం మీడియాతో గంభీర్ మాట్లాడాడు. మూడు ఫార్మాట్లకు ఒకేసారి కోచ్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నదని చెప్పాడు. ముఖ్యంగా వరుస పర్యటనలు, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య తగినంత విరామం లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపాడు. భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ గెలవాలనే అంచనాలు ఉంటాయని పేర్కొన్నాడు. "నిజం చెప్పాలంటే.. నేను కూడా మానసికంగా అలసిపోయిన సందర్భాలున్నాయి. కానీ ఆ ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి నాకుంది. సాధ్యమైనంత కాలం దాన్ని భరిస్తాను. ఒత్తిడిని తట్టుకోగలను. అవసరమైతే బుల్లెట్‌ను కూడా ఎదుర్కొంటాను. నేనూ మనిషినే. కొన్నిసార్లు అలసట తప్పదు. అయితే ఇప్పటివరకు ఆ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నా" అని గంభీర్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడినప్పటికీ తొలి మూడు మ్యాచుల్లో విజయం సాధించడం గొప్ప విషయమని గంభీర్ అన్నాడు. న్యూజిలాండ్‌కు చేరుకున్న తర్వాత ఆటగాళ్లకు కేవలం ఒక్కరోజు మాత్రమే సాధనకు అవకాశం లభించిందని గుర్తుచేశాడు. భిన్నమైన వాతావరణం, మైదాన పరిస్థితుల్లోనూ జట్టు అద్భుతంగా ఆడిందని ప్రశంసించాడు. ఈ విజయానికి ఆటగాళ్లే పూర్తి క్రెడిట్ తీసుకోవాలని చెప్పాడు. 2026లో ఇప్పటివరకు భారత జట్టుతో కలిసి 12 సిరీస్‌లలో గంభీర్ కోచ్‌గా వ్యవహరించాడు. మూడు ఫార్మాట్ల బాధ్యతలు ఒకేసారి నిర్వహిస్తుండటంతో విశ్రాంతికి పెద్దగా అవకాశం దక్కడం లేదు. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల తర్వాత రెండు టెస్టుల సిరీస్ కూడా జరగనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు తగినంత సన్నద్ధత సమయం కల్పించడం ముఖ్యమని గంభీర్ అభిప్రాయపడ్డాడు.

హార్దిక్ పాండ్యా కోసం కేకేఆర్ పట్టు.. ఇద్దరు స్టార్ ఆటగాళ్లను అడుగుతున్న ముంబై!

ఐపీఎల్ 2027 వేలానికి ముందు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను ట్రేడింగ్ ద్వారా తమ జట్టులోకి తీసుకురావడానికి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ (ఎంఐ) పెడుతున్న షరతులు చర్చలకు పెద్ద అడ్డంకిగా మారాయి. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై.. హార్దిక్‌కు బదులుగా తమకు పేసర్ హర్షిత్ రాణా, యువ వికెట్ కీపర్ బ్యాటర్ అంగ్‌క్రిష్ రఘువంశీలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు 'టెలిగ్రాఫ్' నివేదిక పేర్కొంది. మరోవైపు, ఈ ట్రేడింగ్‌లో తమ కీలక ఆటగాళ్లను వదులుకునే ప్రసక్తే లేదని కేకేఆర్ యాజమాన్యం స్పష్టంగా ఉంది. ముఖ్యంగా స్టార్ స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తితో పాటు జట్టు వైస్-కెప్టెన్, కీలక ఫినిషర్ అయిన రింకూ సింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ తన వర్క్‌లోడ్ కారణంగా ఐపీఎల్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడో లేదో స్పష్టత లేనందున, అతడిని కూడా ఈ ట్రేడింగ్‌లో చేర్చే అవకాశం కనిపించడం లేదు వాస్తవానికి హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్, తరచూ గాయాల బారిన పడటం, అలాగే ప్రతీ వేదికకు అతనితో పాటు వచ్చే పెద్ద సిబ్బంది బృందంపై ఉన్న ఆందోళనల కారణంగా కేకేఆర్ యాజమాన్యం ప్రాథమిక చర్చల తర్వాత అంతగా ఆసక్తి చూపలేదని తెలిసింది. అయినప్పటికీ డీల్‌పై ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఐపీఎల్ 2024లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించగా, 2026 సీజన్‌లో ఫ్రాంచైజీ తరఫున అత్యధిక పరుగులు చేసింది అంగ్‌క్రిష్ రఘువంశీనే. ఈ నేపథ్యంలో ఇంతటి కీలక ఆటగాళ్లను వదులుకోవడానికి కేకేఆర్ సిద్ధంగా ఉందో లేదో ఇంకా స్పష్టత లేదు. హార్దిక్ పాండ్యాను దక్కించుకునే రేసులో కేకేఆర్‌తో పాటు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కూడా ఉన్నట్లు సమాచారం. రాజస్థాన్ నుంచి యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్‌లను ముంబై కోరగా, ఆ చర్చలు ముందుకు సాగలేదు. అదేవిధంగా చెన్నై నుంచి యువ బ్యాటర్ ఆయుష్ మ్హత్రేను అడగ్గా, సీఎస్‌కే ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. వచ్చే వారం ఈ ఫ్రాంచైజీల మధ్య చర్చలు తిరిగి ప్రారంభం కానున్నాయని తెలుస్తోంది. అయితే, ఈ డీల్ భవిష్యత్తు మొత్తం అంగ్‌క్రిష్ రఘువంశీ విషయంలో కేకేఆర్ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఊరట.. రిటెన్షన్ గడువు పొడిగింపు!



వచ్చే ఏడాది జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027 మినీ-వేలానికి రంగం సిద్ధమవుతోంది. డిసెంబర్ 16న గోవా వేదికగా ఈ వేలం నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అన్ని ఫ్రాంచైజీలకు ఐపీఎల్ నిర్వాహకులు ఊరటనిచ్చారు. ఇంతకుముందు ఆయా జట్లు తమ ఆటగాళ్ల రిటెన్షన్ జాబితా సమర్పించడానికి నవంబర్ 15 చివరి గడువుగా ఉండేది. అయితే దీనిని మరో రెండు రోజులు పొడిగిస్తూ నవంబర్ 17 వరకు గడువునిచ్చినట్లు ఓ స్పోర్ట్స్ నివేదిక వెల్లడించింది.

రిటెన్షన్, రిలీజ్ జాబితాల తుది ప్రక్రియ ముగిసిన తర్వాత, ఐపీఎల్ వర్గాలు రిజిస్టర్ చేసుకున్న ఆటగాళ్ల పూల్‌ను ఫ్రాంచైజీలతో పంచుకోనున్నాయి. ఆపై షార్ట్‌లిస్ట్ చేసిన ఆటగాళ్లతో తుది వేలం జాబితాను టోర్నీకి వారం రోజుల ముందు ఐపీఎల్ నిర్వాహకులు ప్రకటించనున్నారు. మరోవైపు, ఐపీఎల్ 2027 సీజన్ షెడ్యూల్‌పై కూడా స్పష్టత వస్తోంది. 2024లోనే ప్రకటించిన విండో ప్రకారం.. మార్చి 14 నుంచి మే 30 వరకు ఈ సీజన్‌ను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక తేదీలు త్వరలోనే ఖరారు కానున్నాయి. ఈసారి వేలం గోవాలో జరగనుండటంతో ఫ్రాంచైజీల వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై క్రికెట్ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది.



క్యూట్‌గా కాజల్ అగర్వాల్..

చందమామ కాజల్ అగర్వాల్ తన అందచందాలతో, చరిష్మాటిక్ లుక్స్‌తో సౌత్ సినీ ప్రేక్షకులను దశాబ్దాలుగా అలరిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ భామ తన భర్త గౌతమ్ కిచ్లూతో కలసి పండుగ వాతావరణంలో దిగిన క్యూట్ ఫోటోలతో పాటు, ట్రెండీ అవుట్‌ఫిట్‌లో మెరిసిన మోడరన్ పిక్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. "ఈ దీపావళికి మీరే ఒక బాంబులా మెరిసిపోండి.. వేరే బాంబులు కాల్చకండి" అంటూ కాజల్ ఇచ్చిన క్రేజీ క్యాప్షన్‌తో పాటు ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విశేషాలు ఇప్పుడు చూద్దాం.. తాజా ఫోటోషూట్‌లో కాజల్ అగర్వాల్ ఫ్యాషన్ డిజైనర్ లేబుల్ 'ఖాడ= ధీఖాఖాఖా'కి చెందిన కాంటెంపరరీ ఎథ్నిక్ ఔట్‌ఫిట్‌లో మెరిసిపోయారు. బ్లాక్ ఎంబ్రాయిడరీ బస్టియర్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్‌గా వైబ్రెంట్ రెడ్ ట్రౌజర్స్ మరియు పైన వేసుకున్న ఎలిగెంట్ ఫ్లోయింగ్ ఓవర్‌లే కేప్‌లో కాజల్ ఎంతో గ్లామరస్‌గా కనిపించారు. మోడ్రన్ అండ్ ట్రెడిషనల్ మిక్స్ చేసిన ఈ లుక్ సోషల్ మీడియాలో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

పండుగ సందడితో పాటు తన వివాహ వార్షికోత్సవం, కర్వా చౌత్ వేడుకలను భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి కాజల్ ఎంతో వేడుకగా జరుపుకున్నారు. భర్తతో క్యూట్‌గా ఉన్న ఫోటోను షేర్ చేస్తూ.. "హ్యాపీ కర్వా చౌత్ అండ్ హ్యాపియెస్ట్ యానివర్సరీ మై లవ్.. నిత్యం నీతోనే నా ప్రయాణం" అంటూ ఆమె ఎమోషనల్ విష్ చేశారు.



మమిత బైజు ఎలా మారిపోయింది?

తన సహజమైన నటన కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన యంగ్ బ్యూటీ మమితా బైజు. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు విపరీతంగా దగ్గరైన ఈ మలయాళ భామ, ప్రస్తుతం సౌత్ ఇండియాలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. అయితే మమిత అనే పేరు ఆమెకు ఎలా వచ్చిందో తెలుసా? ఒక చిన్న పొరపాటు వల్ల తన అసలు పేరు మారిపోయిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. బర్త్ సర్టిఫికెట్‌లో జరిగిన చిన్న పొరపాటు: మమితా బైజు పుట్టినప్పుడు ఆమె తల్లిదండ్రులు ఎంతో ఇష్టపడి సీనియర్ నటి 'నమిత' పేరును ఆమెకు పెట్టాలని నిర్ణయించుకున్నారట. అయితే బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో అధికారులు చేసిన చిన్న పొరపాటు కారణంగా 'నమిత' అనే పేరు కాస్తా 'మమిత'గా మారిపోయింది. ఇక ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెంటనే గమనించలేకపోయారు. నాలుగేళ్ల తర్వాత బయటపడ్డ అసలు విషయం: పాపకు నాలుగైదేళ్లు వచ్చి పాఠశాలలో చేర్పించే సమయంలో సర్టిఫికెట్లను పరిశీలించగా అసలు విషయం బయటపడిందట. అప్పటికే ఆఫీషియల్ డాక్యుమెంట్స్ అన్నింట్లోనూ మమిత అనే పేరే నమోదైపోవడంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రులు వేరే దారి లేక 'మమిత' అనే పేరునే కొనసాగించాల్సి వచ్చింది. అలా పొరపాటుతో వచ్చిన ఆ పేరే ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఒక లక్కీ బ్రాండ్‌గా మారిపోయింది 2024లో విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' మమితా బైజు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ సినిమాలో ఆమె నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ యువతను పిచ్చిగా ఆకట్టుకున్నాయి. ఇక దీంతో సౌత్ ఇండియా అంతటా ఆమెకు భారీ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత 'డ్యూడ్', 'జన నాయగన్', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి సినిమాలతో తన కెరీర్‌ను మరింత విస్తరించుకుంది.

ఎథ్నిక్ లుక్‌లో ఆలియా భట్ గ్రాండ్ అప్పీల్..

బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆలియా భట్ తన సరికొత్త ఫ్యాషన్ ఎంపికలతో ఎప్పుడూ అందరినీ ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. తాజాగా ఆమె ఒక గ్రాండ్ ఎథ్నిక్ ఔట్‌ఫిట్‌లో రాయల్ లుక్‌తో దర్శనమిచ్చి, అభిమానులను అమితంగా ఆకట్టుకున్నారు. పాతకాలపు రాయల్ వైబ్‌ను, మోడర్న్ ఫ్యాషన్‌ను ఎంతో చక్కగా మిక్స్ చేస్తూ ఆమె కనిపించిన ఈ స్టన్నింగ్ లుక్, అవుట్‌ఫిట్ మరియు జ్యువెలరీ పూర్తి ప్రైస్ బ్రేక్‌డౌన్ వివరాలు ఇలా వున్నాయి..ఈ రాయల్ అండ్ క్లాసీ లుక్ కోసం ఆలియా భట్ ప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్ సబ్యసాచికి చెందిన ప్రత్యేకమైన గోల్డెన్ ఎథ్నిక్ ఔట్‌ఫిట్‌ను ఎంచుకున్నారు. ఈ 'సబ్యసాచి కస్టమ్ ఎన్సెంబుల్' అంచనా ధర సుమారు రూ. 3,50,000గా ఉంది. ఇక చేతులకు ప్రత్యేకంగా జతచేసిన రిచ్ ఎంబ్రాయిడరీ 'ఎంబెల్లిష్డ్ కఫ్ డీటైల్' అంచనా ధర రూ. 45,000గా నమోదైంది. ఈ అవుట్‌ఫిట్ ఆమెకు మహారాణి లాంటి గ్రాండ్ అప్పీల్‌ను అందించింది. ఈ మొత్తం లుక్‌లో అత్యంత ఖరీదైన మరియు రాయల్ హైలైట్‌గా నిలిచింది ఆమె మెడలో ధరించిన నెక్లెస్. రాయల్ బ్లూ రంగు శాఫైర్ రాళ్లతో దగదగలాడే 'సబ్యసాచి శాఫైర్ చోకర్' నెక్లెస్ అంచనా ధర సుమారు రూ. 12,50,000గా ఉంది. గోల్డెన్ డ్రెస్‌కి ఈ బ్లూ నెక్లెస్ జతచేయడం వల్ల ఆమె లుక్ మరింత శోభాయమానంగా, రాయల్‌గా మారిపోయింది. నెక్లెస్‌కు పర్‌ఫెక్ట్ మ్యాచింగ్‌గా ఆలియా తన వేలికి అత్యంత ఖరీదైన రింగ్‌ను ధరించారు. నీలిరంగు శాఫైర్ స్టోన్‌తో చుట్టూ డైమండ్స్ ఉన్న 'శాఫైర్ స్టేట్‌మెంట్ రింగ్' అంచనా ధర రూ. 8,50,000గా ఉంది. ఇక ఫుట్‌వేర్ విషయానికి వస్తే, కాళ్లకు ఎంతో అందంగా మెరిసే 'నీడిల్‌డస్ట్ ఎంబ్రాయిడర్డ్ జుత్తీలు' ధరించగా, వీటి అంచనా ధర సుమారు రూ. 24,500గా నిలిచింది.



కిల్లింగ్.. స్టన్నింగ్.. ఎన్నారై తెలుగు గాళ్ ఫోటోషూట్ దుమారం

తెలుగు మూలాలు కలిగిన భారతీయ-అమెరికన్ నటి అవంతిక వందనపు పరిచయం అవసరం లేదు. ఇటు టాలీవుడ్, అటు హాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ (ూా షాట్ మ్యాగజైన్) కోసం నిర్వహించిన హాలోవీన్ థీమ్ ఫోటోషూట్ కి సంబంధించిన బిహైండ్ ద సీన్స్ అవుట్‌టేక్స్ ఫోటోలను అవంతిక తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేసారు. ఎడిటర్-ఇన్-చీఫ్ రెమి అల్ ఫలాహ్, ఆర్ట్ డైరెక్టర్ హాలీ గ్లుక్ సారథ్యంలోని ఫాటోగ్రాఫర్ క్సింగర్-క్సాంగర్ తీసిన ఈ డిఫరెంట్ ఫ్యాషన్ షూట్ ఫ్యాన్స్ సహా సినీ ప్రమ-ఖులను ఎంతగానో ఆకట్టుకుంది. స్టైలిస్ట్ సెబాస్టియన్ హోల్ రూపొందించిన ట్రెండీ అవుట్‌ఫిట్స్.. రాచెల్ లీటా హెయిర్ స్టైలింగ్.. రోబెర్టీ మేకప్ -అల్ హెయిల్ థై నైల్- నైల్ ఆర్ట్‌తో అవంతిక బోల్డ్ అండ్ స్టెషల్ లుక్‌లో మెరిసిపోయారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే హాలీవుడ్ ప్రముఖులు టాన్ ఫ్రాన్స్, బెయిలీ బాస్, జోషువా రాబర్ట్ కొల్లీలతో పాటు ఫేమస్ ఫాటోగ్రాఫర్ బ్రాండన్ వోల్ఫెల్ సైతం అవంతిక ఫ్యాషన్ సెన్స్, గ్లామర్‌ను కొనియాడుతూ కామెంట్స్ చేశారు. అవంతిక సినీ ప్రయాణ విషయానికి వస్తే.. అవంతిక తన నటనా జీవితాన్ని టాలీవుడ్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రారంభించారు. మహేష్ బాబు -బ్రహ్మోత్సవం- సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ భామ ఆ తర్వాత -మనం అంతా-, నాగచైతన్య -ప్రేమమ్-, -రారండోయ్ వేడుక చూద్దాం-, -బాబు బాగా బిజీ-, -బాలకృష్ణుడు-, -ఆక్సిజన్-... పవన్ కళ్యాణ్ -అజ్ఞాతవాసి- వంటి పలు తెలుగు సినిమాల్లో బాలనటిగా ఆకట్టుకున్నారు.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA